నేటి కందం-నేటికి అందం

చిరు జీవుల కెందరికో
చెరలను దప్పించి మంచి జీవికల నిడన్
మురిసి మురిసి మురిసి కురిసె
కరుణాత్ముడు వరములను శిఖా శ్వేతలపై !!

(తెలంగాణా రాష్ట్రంలో దాదాపు 6307 మంది తప్పిపోయి దుర్భర జీవితం గడుపుతున్న చిన్నారులను శిఖ, శ్వేత గార్ల నేతృత్వంలో పోలీసు అధికారులు గుర్తించి వారిని వారి తల్లిదండ్రులకు అప్పగించి, పునరావాసం కల్పించి, అనాథాశ్రయాలకు తరలించి చేసిన పవిత్ర సేవను గుర్తించి తెలంగాణా ప్రజలంతా గర్విస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com

చురక

నేరస్తులు ఎవ్వరనీ
నేపాల్ లో జలప్రళయం
శిక్షవేసి మనుషుల్ని
చుట్టే మృత్యు వలయం.
అభివృద్ధికి ప్రకృతిని
ఆహుతిచ్చే మనబుద్ధి
అందుకొరకే అయ్యిందా
అంతానికి దేహశుద్ధి



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 29-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:23 పేజీలు:6 వెల: రూ.1/-


# ఆత్మీయుల కోసం నేపాల్‌లో కన్నీరుమున్నీరు

## 900 మంది సురక్షితం..

## ఇంకా వందలాది మంది గల్లంతు



నేపాల్, ఆగష్టు 28: నేపాల్ అత్యవసర సహాయక కేంద్రంగా మారిన ఆర్మీ బ్యారక్స్ బయట శుక్రవారం హృదయ విదారక దృశ్యాలు నెలకొన్నాయి. .ఆ ప్రాంగణం బయట ఒక గుడిసె గోడకు పేర్లు, పుట్టిన తేదీలతో కూడిన కాగితాలు అంటించి ఉన్నాయి. తమ ఆత్మీయుల కోసం వెతుకుతున్న జనం, వణుకుతున్న వేళ్లతో ఆ నోటీసులపై పేర్లను పరిశీలిస్తూ ముందుకు దూసుకెళ్లారు. కాస్త దూరంలో, బంధువులు కంచెకు అవతలి వైపు బెంచీపై కూర్చుని లాగ్ బుక్‌లు చూసుకుంటున్న ఇద్దరు సైనికులకు తమ బంధువల పేర్లు, ఫోన్ నంబర్లను వినిపిస్తూ వివరాలు చెబుతున్నారు. ఈ విపత్తులో గాయపడిన క్షతగాత్రులు నీలం రంగు కాన్వాస్ టెంట్ల కింద ఏర్పాటు చేసిన తాత్కాలిక పడకలపై పడుకుని ఉన్నారు. అక్కడక్కడా నీళ్ల బాటిళ్ల కుప్పలు కనిపించగా, చిన్న పిల్లలు అటు ఇటు తిరుగుతూ ఆడుకుంటున్నారు; ఒక చిన్నారి జ్యూస్ కార్టన్ నుండి జ్యూస్ తాగుతూ కనిపించాడు.

**ఇప్పటికి 900 మంది సురక్షితం**

సుమారు 900 మందిని రక్షించినట్లు జనరల్ రాజారామ్ బాస్నెట్ చెప్పారు. వీరంతా చైనా సరిహద్దు సమీపంలోని రసువా జిల్లాకు చెందిన టిమురే స్యాప్రుబెసి ప్రాంతాలవారని, వరదల ధాటికి ఈ ప్రాంతం తీవ్రంగా దెబ్బతిన్నదని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో వర్ష సూచన ఇతర సమస్యల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలగవచ్చని ఆయన చెప్పారు. సురక్షితంగా తరలిం,చిన వారిలో 92 మంది భారతీయులు, 13 మంది చైనీయులు, 8 మంది కొరియన్లు, ఇద్దరు ఇటాలియన్లు, ఇద్దరు అమెరికన్లు ఉన్నారు.

వందలాది మంది నేపాలీల ఆచూకీ ఇంకా తెలియలేదు. . ఏదైనా సమాచారం దొరుకుతుందనే ఆశతో కంచె అవతలి నుంచి గట్టిగా అరిచిన ఒక వ్యక్తి, విదేశీయులను (జలవిద్యుత్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది,. టిబెట్ వెళ్తున్న యాత్రికులతో సహా) గుర్తించి రక్షించడంపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టారని ఆరోపించారు.ఇదే సమయంలో, జలవిద్యుత్ కేంద్రంలో పనిచేసే కపూర్ సింగ్ తమాంగ్ అనే వ్యక్తిని హెలి కాప్టర్ ద్వారా బ్యారక్స్‌కు సురక్షితంగా చేర్చారు. మక్వాన్‌పూర్ జిల్లాలోని హెటౌడాలోని అతడి ఇంటికి పోలీసులు చేర్చారు, . అంబులెన్స్‌లు, సైనిక వాహనాలను లోపలికి అనుమతించడానికి ప్రధాన ద్వారం తెరుచుకున్నప్పుడు, సమాచారం కోసం బయట వేచి ఉన్న ఆందోళనకరమైన జనసమూహం క్షణకాలం పాటు కనిపించింది.

## విదేశాల రెస్క్యూ సహాయాన్ని తిరస్కరించిన నేపాల్

జల ప్రళయంతో అతలాకుతలమైన నేపాల్(ఔవజూజీశ్రీ ఈశ్రీజీబష్ట ఈశ్రీనీనీటబ)కు ప్రపంచ దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. అయితే తమకు ఎటువంటి సహాయం అవసరం లేదని నేపాల్ పేర్కొన్నది. సెర్చ్, రెస్క్యూ బృందాలు సాయాన్ని నేపాల్ తిరస్కరించింది. తమ స్వంత భద్రతా బలగాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టే సామర్థ్యం ఉన్నట్లు నేపాల్ వెల్లడించింది. బుధవారం సంభవించిన బురద, వరద విలయం వల్ల అనేక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అయితే బోటెకోసి, త్రిశూలీ నది పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.



రెస్క్యూ ఆపరేషన్ కోసం అనేక దేశాలు, అంతర్జాతీయ సంస్థలు సాయం చేసేందుకు ముందుకు వచ్చాయని, కానీ ఆ అభ్యర్థనలను తిరస్కరించినట్లు నేపాల్ విదేశాంగ శాఖ తెలిపింది. నేపాలీ సెక్యూర్టీ దళాలే సెర్చ్ ఆపరేషన్‌కు నాయకత్వం వహిస్తాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. చైనాతో పాటు ఇతర దేశాల నుంచి వస్తున్న అభ్యర్థనలను తిరస్కరించినట్లు నేపాల్ చెప్పింది.అయితే విదేశీ సహాయ బృందాలకు బదులుగా .. ఆర్థికసాయాన్ని నేపాల్ కోరుతోంది. పునర్నిర్మాణ దశలో అంతర్జాతీయ సహాయాన్ని కోరనున్నట్లు నేపాల్ చెప్పింది. నేపాల్ వరదల్లో మృతుల సంఖ్య 469కి చేరుకున్నది. టిబెట్‌లో మళ్లీ వరదలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడ రెస్క్యూ ఆపరేషన్‌ను చైనా నిలిపివేసింది. 10 లక్షల డాలర్ల ఆర్థిక సాయాన్ని ఇవ్వనున్నట్లు శ్రీలంక ప్రకటించింది.

## నేపాల్‌లో మంటగలిసిన మానవత్వం.. వరద మృతురాలిని బయటకులాగి.. చెవి కమ్మలు కొట్టేసిన దుర్మార్గులు



నేపాల్, ఆగష్టు 28: నేపాల్ ఆకస్మిక వరదలో ప్రాణాలు కోల్పోయిన వారి గురించిన సమాచారం అందరి గుండెనూ బరువెక్కేలా చేస్తోంది. నేపాల్‌లో వరద బాధితులు కోలుకోవాలని, వీలైనంత మంది ప్రాణాలతో బయటపడాలని అందరూ కోరుకుంటున్నారు. ఇలాంటి విషాద సమయంలో మానవత్వం చూపాల్సిన కొందరు.. ఆ మానవత్వానికే మచ్చగా నిలిచారు. వరదల్లో మరణించిన ఒక మహిళ మృతదేహాన్ని జుట్టుతో లాగి, ఆమె చెవి కమ్మలు తీసుకున్నారు.

ఇద్దరు వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటన నేపాల్‌లోని నారాయణి నది ప్రాంతంలో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో పోలీసులు స్పందించారు. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. బుధవారం నేపాల్‌లో సంభవించిన వరదల్లో పలువురు గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనేక మృతదేహాలు ఇతర ప్రాంతాలకూ కొట్టుకుపోయాయి. తాజాగా నారాయణి నదిలోకి పలు మృతదేహాలు కొట్టుకువచ్చాయి. వాటిలో ఒక మహిళ మృతదేహం కూడా ఉంది.

అయితే, స్థానికుల్లో 25 ఏళ్ల మదన్ గురుంగ్, 38 ఏళ్ల ఉమేష్ చౌదరి అనే ఇద్దరు వ్యక్తులు ఆ మహిళ మృతదేహాన్ని నీళ్ల నుంచి ఒడ్డుకు లాగారు. అది కూడా ఆమె జుట్టు పట్టుకుని లాగారు. అనంతరం ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలు తీసుకున్నారు. ఈ ఘటనను అక్కడి వారెవరో రికార్డు చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయింది. ఈ ఘటనపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ విషాద సమయంలో మృతదేహాల విషయంలో సానుభూతి, గౌరవ ప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సింది పోయి.. అవకాశవాదుల్లాగా, వారి ఒంటిపై బంగారు ఆభరణాల్ని కొట్టేయడం, జుట్టు పట్టి మృతదేహాల్ని లాగడంపై విమర్శలు చేస్తున్నారు.

ఇలాంటి సమయంలో ఇదేనా మానవత్వం అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ ఘటనపై స్తానిక చిట్వాన్ పోలీసులు స్పందించారు. నిందితులు మదన్, ఉమేష్‌లను పోఖారా బస్ పార్క్ వద్ద అరెస్టు చేశారు. వారివద్ద నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా మృతదేహాలపై నగలు తీసుకోవడం లేదా ఎలాంటి అమానవీయ చర్యలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరుపై మంత్రి దామోదర్ సీరియస్

హైదరాబాద్, ఆగష్టు 28: జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరుపై తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన వారిపై విచారణకు మంత్రి ఆదేశించారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు.

ఈ మేరకు జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్‌తో చికిత్సపై మీడియాలో వచ్చిన కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తుతో మంత్రి దామోదర్ మాట్లాడారు.

ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ హుకుం జారీ చేశారు.

## రాఖీ పండుగ వేళ స్కూల్ పిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగష్టు 28: రాఖీ పండుగ నేపథ్యంలో ఇవాళ స్కూల్ పిల్లలతో ప్రధాని మోదీ(ఖఓ ఓనీటతి) కాసేపు సరదాగా గడిపారు. ఢిల్లీలోని ఆయన అధికార నివాసం 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఆ సంబరాలు జరిగాయి. చిన్నతనంలో మీరెటువంటి కల కన్నారని పిల్లలు ప్రధాని మోదీని అడిగారు. ఆ ప్రశ్నకు మోదీ సరదాగా సమాధానం ఇచ్చారు. మీ అందరితో కలువాలని ఆయన నవ్వుతూ జవాబు ఇచ్చారు. చిన్నారులతో మాట్లాడుతున్న వీడియోను రిలీజ్ చేశారు. మోదీ వారికి షేక్ హ్యాండ్ ఇచ్చారు. హై5 చేతులతో కుర్రాళ్ల తరహాలో విషెస్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఆ రీల్‌ను షేర్ చేశారు. చిన్నారులను ఆయన దీవించారు. రక్షాబంధన్ గ్రీటింగ్స్ కూడా ఆయన తెలిపారు. ప్రేమ, ఆప్యాయత, నమ్మకం గురించి ఆయన చెప్పారు. రాఖీ పండుగ మీ జీవితాల్లో సంతోషాన్ని, సౌభాగ్యాన్ని, విజయాన్ని అందించాలని కోరుతున్నట్లు మోదీ పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా చేయించిన బంగారు రాఖీ కట్టిన కొండా సురేఖ



హైదరాబాద్, ఆగష్టు 28:రాఖీ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీలు కట్టారు. కాగా, మంత్రి కొండా సురేఖ సీఎం కోసం ప్రత్యేకంగా చేయించిన బంగారు రాఖీ కట్టారు. అలాగే సీఎం మనవడికి, అల్లుడికి కూడా రాఖీ కట్టారు. పండగ వాతవరణంలో నేను ఎలాంటి కామెంట్స్ చేయను అని రాఖీ కట్టిన వెంటనే కొండా సురేఖ వెనుదిరిగి వెళ్లిపోయారు. సీఎం రేవంత్‌పై మంత్రి సురేఖ కూతురు సుస్మిత చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంత్రిని తొలగించాలని కాంగ్రెస్ నాయకులు హైకమాండ్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సురేఖ సీఎంను కలువడం ప్రాధాన్యం సంతరించకుంది.

## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన..

హైదరాబాద్, ఆగష్టు 28:తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కులం, మతం, రాజకీయ పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

శుక్రవారం హైదరాబాద్ లోని క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్ కోసం లాటరీ తీసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత జాబితాను విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో టవర్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు.

ఏడాది లోపే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, వాటిని ఆడబిడ్డల పేరుమీద అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోమని స్పష్టం చేశారు.అలాగే, ఇల్లు పొందిన వారు పదేళ్ల తర్వాత దానిని విక్రయించుకునే హక్కు ఉంటుందని తెలిపారు. ఇల్లు రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత అవసరమైతే దానిని తాకట్టు పెట్టుకుని రుణం పొందేందుకు కూడా అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

## పోలీసుల వినూత్న కార్యక్రమం.. హెల్మెట్ లేనివారికి రాఖీ కట్టారు..



కామారెడ్డి, ఆగష్టు 28:(నేటినిజం ప్రతినిధి): హెల్మెట్లు లేని వాహనదారులకు ఎప్పుడూ చలాన్లు వేసే ట్రాఫిక్ పోలీసులు.. నేడు రక్షా బంధన్ సందర్భంగా ప్రేమతో రాఖీలు కట్టారు. కామారెడ్డి డీఎస్పీ ఆదేశాలతో పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో రాఖీ పూర్ణిమ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూట్టారు. వివరాల్లోకెళితే...

హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి బొట్టు పెట్టి, రాఖీ కట్టి.. హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు ట్రాఫిక్ పోలీసులు. హెల్మెట్ ధరించడం ప్రతి కుటుంబానికీ రక్ష అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాల బారినపడతారని హెచ్చరించారు. రక్షా బంధన్ నాడు రాఖీ ఎంత రక్షణ ఇస్తుందని విశ్వసిస్తామో.. హెల్మెట్ కూడా నిత్యం అంతే రక్షణను ఇస్తుందని పేర్కొన్నారు. పోలీసులు ఇలా ద్విచక్ర వాహనదారులను ఆపి ఆప్యాయంగా రాఖీ కట్టడం చూసి వాహనదారులు అవాక్కయ్యారు. ఈ రకమైన శైలిలో వినూత్నంగా అవగాహన కల్పించడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# దృఢమైన దేహంలో చురుకైన మెదడు ఉంటుంది

## (29 ఆగస్టు "జాతీయ క్రీడా దినోత్సవం" సందర్భంగా)

భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు, హాకీ విజర్డ్, లేదా హాకీ మెజీషియన్ అనే పలు పేర్లతో పిలువబడే భారత వీర సైనికుడు, భారత హాకీ జట్టుకు నాటి నాయకుడు అయిన మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏట 29 ఆగస్టు రోజున దేశవ్యాప్తంగా "జాతీయ క్రీడా దినోత్సవం" లేదా "నేషనల్ స్పోర్ట్స్ డే" పాటించడం ఆనవాయితీగా వస్తున్నది. దేశ ప్రజలకు, ముఖ్యంగా స్టూడెంట్స్, యువతీయువకుల దృష్టిని క్రీడల వైపు ఆకర్షించడం, క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యం, స్నేహం, సమానత్వం, క్రీడా విలువలను కాపాడడం, ఆటలతో ఆరోగ్యకర పౌర సమాజాన్ని నిర్మించడం, క్రీడా ప్రతిభతో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయడం, జట్టు స్ఫూర్తిని పెంపొందించుకోవడం, జాతి ఐక్యతను పెంపొందించడం, గెలుపోటములను సమానంగా తీసుకునే తత్వాన్ని అలవర్చుకోవడం లాంటి ప్రయోజనాలను సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడం అనే లక్ష్యంతో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుంది.

### హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ ప్రతిభ::

29 ఆగస్టు 1905న ప్రయాగ్‌రాజ్, యూపీలో జన్మించిన ధ్యాన్ చంద్ పాఠశాల విద్య అనంతరం 1922లో భారత ఆర్మీలో సైనికుడిగా చేరడం, తన సీనియర్ అధికారి ఎస్.ఎం. తివారీ ప్రేరణ, శిక్షణలతో హాకీ బ్యాట్ చేతపట్టి ప్రాక్టీసు చేయడం, ఆట పట్ల ఆసక్తి పెరిగి మంచి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం, అద్భుత ఆట తీరును ప్రదర్శించి క్రీడాకారుల దృష్టిని ఆకర్షించడం చూస్తుండగానే జరిగిపోయాయి. మూడు ఒలంపిక్ బంగారు పతకాలు పొందిన భారత హాకీ జట్టులో ప్రధాన ఆటగాడిగా, 1936 బెర్లిన్ ఒలంపిక్స్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా సేవలు అందించిన ధ్యాన్ చంద్ ఆర్మీలో పదేన్నతులను త్వరత్వరగా పొందుతూ అధికారి హోదా మేజర్ స్థాయికి ఎదిగాడు. తన క్రీడా జీవితంలో 1926 నుంచి 1948 వరకు 400లకి పైగా అంతర్జాతీయ స్థాయిలో గోల్స్ చేయడంతో పాటు పలు జాతీయ స్థాయి పోటీల్లో 1,000 వరకు గోల్స్ చేయడం ధ్యాన్ చంద్‌కు మాత్రమే ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ఆయన చూపిన అద్భుత క్రీడా ప్రతిభకు గుర్తింపుగా ధ్యాన్ చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా పాటించడం 2012 నుంచి ప్రారంభం అయ్యింది. ధ్యాన్ చంద్ క్రీడా ప్రతిభకు మురిసి పోయిన భారత ప్రభుత్వం 1956లో ఆయనకు పద్మ భూషణ్ పురస్కారం అందజేయడం సముచితంగా ఉన్నది.

### జాతీయ క్రీడా దినోత్సవం-2026 ఇతివృత్తం:

భారత ప్రభుత్వం 2026 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 29 నుంచి 31 ఆగస్టు వరకు మూడు రోజుల పాటు క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. 2025 జాతీయ క్రీడా దినోత్సవం ఇతివృత్తంగా "ఖేలేగా భారత్ : జీతేగా భారత్ (భారత్ ఆడుతుంది : భారత్ గెలుస్తుంది)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతుంది. ప్రతి ఒక్కరికీ గంట పాటు మైదాన క్రీడలు ఆడాలని "ఎక్ గంట, ఖేల్ కే మైదాన్ మే" అంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు ఇవ్వడం సముచితంగా ఉన్నది. జాతీయ క్రీడా దినోత్సవం రోజున ప్రతి ఏట అత్యుత్తమ క్రీడాకారులకు ఖేల్ రత్న, ద్రోణాచార్య, అర్జున అవార్డులను అందించడం ఒక సదాచారంగా వస్తున్నది. క్రీడా విభాగాలు నిత్యం వాడుకునే "దృఢమైన దేహంలో చురుకైన మెదడు (సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ)" అనబడే నినాదం బహుళ ప్రచారంలో ఉండడమే కాకుండా క్రీడల ప్రాధాన్యతను వ్యక్తం చేస్తున్నది.

నేటి యువత వీడియో గేమ్స్ పట్ల చూపుతున్న ఆసక్తితో క్రీడలకు దూరం అవుతున్నారు. విద్యాలయాల్లో కూడా మార్కులు, ర్యాంకులు అంటూ యువతను క్రీడలకు దూరం చేయడం జరుగుతోంది. చిన్నతనం నుంచే స్మార్ట్‌ఫోన్ తెరలకు అతుక్కుపోతున్న పిల్లలు స్థూలకాయులుగా మారి అనారోగ్యాల బారిన పడుతున్నారు. మైదాన క్రీడల పట్ల నేటి పిల్లలకు చిన్నతనంలోనే ఆసక్తి జూదాలను నాటాలి. ఆటలతో శారీరక ఆరోగ్యం, మానసిక చురుకుదనం పెరుగుతాయనే అవగాహనను తల్లిదండ్రులు, క్రీడా ఉపాధ్యాయులు, పౌర సమాజం కల్పించాలి. ఆట స్థలాలన్నీ యువ క్రీడాకారులతో నిండిపోవాలి. భారత త్రివర్ణ పతాకాన్ని ప్రపంచ క్రీడా యవనికపై రెపరెపలాడే స్థాయికి చేర్చాలని కోరుకుందాం. రేపటి ఆరోగ్య భారత్ నిర్మాణానికి నేటి పిల్లలు, యువత అవిరళ కృషి చేయాలని కోరుకుందాం, అలాంటి క్రీడాకారులను ప్రోత్సహిద్దాం, పురస్కారాలు అందజేద్దాం.



-మధుపాళీ
9949700037

# శ్రీ ప్రసాద పర్యటనతో భారత - మొరాకో ఆర్థిక భాగస్వామ్యం మరింత బలోపేతం



న్యూఢిల్లీ, ఆగష్టు 28:వాణిజ్యం, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద 2026 ఆగస్టు 24, 25 తేదీల్లో మొరాకోలో జరిపిన అధికారిక పర్యటన విజయవంతంగా ముగిసింది.. ఈ సందర్భంగా ఆయన మొరాకోకు చెందిన పలువురు సీనియర్ మంత్రులు, ప్రముఖులతో వరుస ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు ఈ పర్యటన సందర్భంగా మొరాకో పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి, విదేశీ వాణిజ్య వ్యవహారాల శాఖ ఇన్చార్జి మంత్రి శ్రీ ఒమర్ హెజీరాతో కలిసి భారత్ – మొరాకో సంయుక్త కమిషన్ 7వ సమావేశానికి శ్రీ జితిన్ ప్రసాద సహాధ్యక్షత వహించారు.

భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మొరాకో రాజు మహారాజు మొహమ్మద్ (6) నాయకత్వంలో భారత్ – మొరాకో దేశాల మధ్య చిరకాలంగా కొనసాగుతున్న పరస్పర ప్రయోజనకరమైన భాగస్వామ్యం బలమైన వ్యూహాత్మక పురోగతిని సాధించింది.

పర్యటన సందర్భంగా శ్రీ జితిన్ ప్రసాద మొరాకో – ఇండియా బిజినెస్ ఫోరంలో పాల్గొన్నారు. మొరాకోకు చెందిన సీనియర్ మంత్రులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. భారతీయ వ్యాపార వర్గాలతో సమావేశమై చర్చలు జరిపారు., మొరాకోకు చెందిన ఓసీపీ గ్రూప్ భారతీయ భాగస్వాములతో కలిసి ఏర్పాటు చేసిన ఉమ్మడి భాగస్వామ్య ఇండియా–మారోక్ ఫాస్ఫోర్ (ఐఎంఏసీఐడి) తయారీ కేంద్రాన్ని సందర్శించి, ఫాస్ఫేట్లు, ఎరువుల రంగంలో భారత్ – మొరాకో మధ్య దీర్ఘకాలంగా కొనసాగు తున్న భాగస్వామ్యాన్ని సమీక్షిం చారు.

శ్రీ జితిన్ ప్రసాద వెంట భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నేతృత్వంలోని ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధి బృందం కూడా మొరాకో పర్యటనలో పాల్గొంది. ఈ బృందం ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ, రబాత్ – సలే – కెనిత్రా సర్వీసెస్‌తో పాటు మొరాకో ఎంటర్‌ప్రైజెస్ జనరల్ కాన్ఫెడరేషన్ (సీజీఈఎం) ప్రతినిధులతో ఫలప్రదమైన సమావేశాలు నిర్వహించింది.

### 7వ భారత్ – మొరాకో సంయుక్త కమిషన్ సమావేశం

భారత్– మొరాకో సంయుక్త కమిషన్ ఏడో సమావేశం ద్వైపాక్షిక ఆర్థిక భాగస్వామ్యానికి నూతన ఊపునిచ్చింది. వాణిజ్యాన్ని పెంపొందించడం, మార్కెట్ లభ్యతను బలోపేతం చేయడం, పెట్టుబడులు పారిశ్రామిక భాగస్వామ్యాలను ప్రోత్సహించడం, భారత, మొరాకో వ్యాపార సంస్థలకు కొత్త అవకాశాలను కల్పించడం లక్ష్యంగా సహకారానికి విస్తృతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది.

ఈ సందర్భంగా ఇరు దేశాలు ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సంబంధాల్లో సాధించిన పురోగతిని సమీక్షించాయి. వాణిజ్యం, పెట్టుబడులు, పరిశ్రమలు, ఎరువులు, వ్యవసాయం, ఔషధాలు, ఇంధనం, ఖనిజాలు, డిజిటల్ మార్పు, రవాణా తదితర పరస్పర ప్రయోజన రంగాల్లో సహకారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించాలని అంగీకరించాయి. 2025లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 4 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంది. ఇది భారత్, మొరాకో మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాల నిరంతరం బలోపేతం తీరును ప్రతిబింబిస్తోంది. చిరకాల స్నేహం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తమ నిబద్ధతను ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి.

వాణిజ్య ఉత్పత్తుల పరిధిని కొత్త రంగాలకు విస్తరించడం, వస్తువులు, సేవల రంగాల్లో ఇరు దేశాల మార్కెట్ లభ్యతను పెంచడం ద్వారా ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల్లో ఇప్పటి వరకు వినియోగించని గణనీయమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఇరు పక్షాలు ఉద్ఘాటించాయి. రానున్న ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసే దిశగా కృషి చేయాలని అంగీకరించాయి.

ఈ లక్ష్యాన్ని సాధించేందుకు వ్యాపార ప్రతినిధి బృందాల పరస్పర పర్యటనలు, అవకాశాల అన్వేషణకు సంబంధించిన మిషన్లు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా కొత్త వ్యాపార అవకాశాలను గుర్తించడం, మార్కెట్ లభ్యతను సులభతరం చేయడం, మొరాకో, భారతీయ కంపెనీల మధ్య సుస్థిర, సంయుక్త భాగస్వామ్య సంస్థలను ప్రోత్సహించడంలో దోహదపడుతుందని ఇరు దేశాలు పేర్కొన్నాయి.

వాణిజ్యాన్ని మరింత విస్తరించేందుకు ఎరువులు, రసాయనాలు, ఖనిజ వనరులు, యంత్రాలు, విద్యుత్ పరికరాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వాహనాలు, నిర్మాణ సామగ్రి, పాలిమర్లు, వ్యవసాయ–ఆహార ఉత్పత్తులు, టీ, లోహాలు, పర్యాటకం వంటి రంగాలను ఇరు దేశాలు కీలక అవకాశాలుగా గుర్తించాయి. ఔషధ ఉత్పత్తులకు ముందస్తుగా అంచనా వేయగలిగే విధంగా, సకాలంలో మార్కెట్ లభ్యత కల్పించడం కూడా ముఖ్యమని ఇరు దేశాలు అంగీకరించాయి.

ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లేందుకు సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడంలో భాగంగా, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను, రెండు దేశాల మధ్య ప్రాధాన్యత వాణిజ్య ఒప్పందం సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు భారత్ – మొరాకో సంయుక్త కార్యాచరణ బృందం (జేడబ్ల్యూజీ) ఏర్పాటు చేయాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. వస్తువులు, సేవలకు మెరుగైన మార్కెట్ లభ్యత, వాణిజ్య సౌలభ్యం కల్పించే అవకాశాలను అన్వేషించడంతో పాటు సుంకాల, సుంకేతర అవరోధాలను కూడా జేడబ్ల్యూజీ పరిశీలిస్తుంది.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఔషధ రంగంలో సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా భారతీయ ఔషధ కంపెనీలు ఎదుర్కొంటున్న నియంత్రణపరమైన, మార్కెట్ లభ్యతకు సంబంధించిన సమస్యలను ఉమ్మడిగా పరిష్కరించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఇందులో మార్కెట్ అనుమతి విధానాలు, ఆమోదానికి పట్టే సమయం వంటి అంశాలు ఉన్నాయి. భారత పక్షం కీలక ఎగుమతి ఉత్పత్తులకు సంబంధించిన మార్కెట్ లభ్యత సమస్యలతో పాటు, భారత్ నుంచి దిగుమతి చేసుకునే సిరామిక్ టైల్స్‌పై ప్రస్తుతం కొనసాగుతున్న తనిఖీలకు సంబంధించిన సమస్యలను భారత పక్షం మొరాకో దృష్టికి తీసుకువచ్చింది.

వ్యాపార సంస్థల మధ్య పరస్పర భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వాణిజ్య ప్రదర్శనలు, ఎగ్జిబిషన్లు, బిజినెస్ ఫోరమ్‌లు, పెట్టుబడులకు సంబంధించిన కార్యక్రమాల్లో పరస్పరం పాల్గొనడం ప్రాధాన్యతను రెండు దేశాలు గుర్తించాయి. ఇరు దేశాల ప్రైవేట్ రంగాల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో మొరాకో – ఇండియా బిజినెస్ కౌన్సిల్, మొరాకో – ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పాత్రను మరింత బలోపేతం చేయాలని అంగీకరించాయి.

వ్యవసాయ రంగంలో సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత, ఎస్‌పీఎస్ చర్యలు, ఆహార భద్రతా ప్రమాణాలు, వ్యవసాయ పరిశోధన, డిజిటల్ వ్యవసాయం, బయోటెక్నాలజీ, వ్యవసాయ విలువ శ్రేణులు వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

మొరాకోకు చెందిన నేషనల్ ఆఫీస్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ, భారతదేశంలోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మధ్య ఆహార భద్రత రంగంలో సహకారానికి సంబంధించి కుదిరిన అవగాహన ఒప్పందంపై సంతకాలను ఇరు పక్షాలు స్వాగతించాయి. ఈ అవగాహన ఒప్పందం ద్వారా సమాచార మార్పిడి, సాంకేతిక నైపుణ్యం, ఉత్తమ విధానాల పరస్పర మార్పిడి, సామర్థ్య నిర్మాణం వంటి అంశాలతో పాటు సురక్షితమైన, సుస్థిరమైన ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సులభతరం చేసే కార్యక్రమాలకు ఒక సమగ్ర యంత్రాంగం ఏర్పడుతుంది.

సంయుక్త కమిషన్ సమావేశం సందర్భంగా 2026 – 2030 సంవత్సరాలకు సంబంధించిన సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంపై కూడా ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. కళాకారులు, వృత్తి నిపుణుల పరస్పర మార్పిడి, ఉత్సవాలు, ప్రదర్శనల్లో పాల్గొనడం, వారసత్వ పరిరక్షణలో సహకారం, మ్యూజియంలు, గ్రంథాలయాలు, ఆర్కైవ్ సంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం ద్వారా సాంస్కృతిక మార్పిడి, సహకారాన్ని ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది. భారత్ – మొరాకో మధ్య దౌత్య సంబంధాలకు 2027లో 70వ వార్షికోత్సవం నేపథ్యంలో, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య పరస్పర సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇది ఒక మంచి అవకాశంగా ఉంటుందని ఇరు దేశాలు పేర్కొన్నాయి. భారత్ – మొరాకో సంయుక్త కమిషన్ ఎనిమిదో సమావేశాన్ని న్యూఢిల్లీలో నిర్వహించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ సమావేశ తేదీని దౌత్య మార్గాల ద్వారా పరస్పర అంగీకారంతో నిర్ణయించనున్నారు.

2026 ఆగస్టు 24న కాసాబ్లాంకాలో మొరాకో ఎంటర్‌ప్రైజెస్ జనరల్ కాన్ఫెడరేషన్ నిర్వహించిన మొరాకో – ఇండియా బిజినెస్ ఫోరంలో శ్రీ జితిన్ ప్రసాద పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాపార, పెట్టుబడి సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఆటోమోటివ్, కృత్రిమ మేధ, పునరుత్పాదక ఇంధనం, అంకుర పరిశ్రమలు, ఆర్థిక సేవలు, ఎరువులు, రసాయనాలు, ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాలను కీలక ప్రాధాన్యతా రంగాలుగా ఆయన పేర్కొన్నారు.

ఆటోమోటివ్ విలువ శ్రేణుల్లో ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు, వాటి కూర్పు (ప్రెసిషన్ సబ్ అసెంబ్లీ) రంగాల్లో మరింత సహకారానికి ఉన్న అవకాశాలను శ్రీ జితిన్ ప్రసాద వివరించారు. సౌరశక్తి, ఇంధన నిల్వ, విద్యుత్ గ్రిడ్ నిర్వహణ వంటి పునరుత్పాదక ఇంధన రంగాలు, అంకుర పరిశ్రమలు, ఫిన్‌టెక్, ఆర్థిక సేవలు, కృత్రిమ మేధ, ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్, ఔషధాలు, వైద్య పరికరాలు, డిజిటల్ హెల్త్ వంటి ఔషధ, ఆరోగ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింతగా విస్తరించేందుకు అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ అందిస్తున్న అవకాశాలను శ్రీ జితిన్ ప్రసాద వివరించారు. మొరాకో వ్యాపార సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని, సంయుక్త సంస్థలను ఏర్పాటు చేసి, భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతతో పాటు వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా, ఆధునిక, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమైన ఆర్థిక వ్యవస్థను భారత్ నిర్మిస్తోందని శ్రీ జితిన్ ప్రసాద పేర్కొన్నారు. ఇది భారత్ – మొరాకో మధ్య వ్యాపార, పెట్టుబడి భాగస్వామ్యాలను మరింతగా విస్తరించేందుకు గణనీయమైన అవకాశాలను అందిస్తోందని ఆయన తెలిపారు.

మొరాకోకు చెందిన ఓసీపీ గ్రూప్ భారతీయ భాగస్వాములతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థ ఇండియా – మారోక్ ఫాస్ఫోర్ ను శ్రీ జితిన్ ప్రసాద సందర్శించారు. ఈ సందర్భంగా ఫాస్ఫేట్లు, ఎరువుల రంగాల్లో భారత్ – మొరాకో మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని ఆయన సమీక్షించారు.

ఓసీపీ గ్రూప్ భారతీయ భాగస్వాములైన పారాదీప్ ఫాస్ఫేట్స్ లిమిటెడ్, ఇండో–మొరాక్ ఫాస్ఫోర్ ల సంయుక్త భాగస్వామ్యాలతో సహా రెండు దేశాల మధ్య ఈ వ్యూహాత్మక రంగంలో కొనసాగుతున్న బలమైన, నిరంతర సహకారాన్ని ఇరుపక్షాలు స్వాగతించాయి.

భారత వ్యవసాయ రంగ అవసరాలకు అనుగుణంగా ఫాస్ఫేట్లు, ఎరువులను సరఫరా చేసేందుకు తమ నిబద్ధతను ఓసీపీ ప్రతినిధి బృందం మంత్రికి వివరించింది. ఈ పర్యటన ద్వారా భారత ఎరువుల సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంలోనూ, ఫాస్ఫేట్లు, ఎరువుల రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించడంలోనూ ఈ భాగస్వామ్యానికి ఉన్న ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది.

# పొలంలోని నూతన ధాన్యాలు నాగోబాకు సమర్పణ

## నేటి నుంచి నూతన ధాన్యాలతో వంటకాలు



ఆదిలాబాద్, ఆగష్టు 28: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో కొలువైన నాగోబా దేవతకు మేస్రం వంశీయులు నూతన ధాన్యాలను సమర్పించారు.

తమ పొలాల్లో పండించిన పెసలు, మినుములు, త్వరలో పండనున్న ఇతర ధాన్యాలను 22 తెగలకు చెందిన మేస్రం వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ ఆరాధ్య దైవమైన నాగోబాకు సమర్పించారు. శుక్రవారం ఆలయ పీఠాధిపతి పటేల్ మేస్రం వెంకట్రావు, నాగోబా ఆలయ పూజారి కటోడా కోశేరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం దేవత ముందు నూతన ధాన్యాలను సమర్పించి మేస్రం వంశీయులు మొక్కులు చెల్లించుకున్నారు. నాగోబా ఆశీస్సులు, ఆదేశాలు పొందారు.

నూతన ధాన్యాలను సమర్పించిన అనంతరం నేటి నుంచి వాటితో వివిధ రకాల వంటకాలు తయారు చేసుకుని స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిరావు పటేల్, ప్రధాన్ మేస్రం దాదిరావు, సర్పంచ్ తుకారాం, మేస్రం నాగనాథ్‌తో పాటు పలువురు మేస్రం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అందుబాటులో సరిపడా ఉల్లి నిల్వలు

న్యూఢిల్లీ, ఆగష్టు 28:రాబోయే నెలల్లో తగినంత లభ్యతను నిర్ధారించడం, సీజనల్ ధరల ఒత్తిళ్లను నియంత్రించడం లక్ష్యంగా ప్రభుత్వం బఫర్ స్టాక్ నుంచి ఉల్లిపాయలను అవసరాలకు అనుగుణంగా, అత్యంత నియంత్రిత విధానంలో విడుదల చేయడం ప్రారంభించింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ధరల పోకడల ఆధారంగా... రైల్వే ర్యాక్‌లు, రోడ్డు రవాణాతో కూడిన హైబ్రిడ్ రవాణా నమూనా ద్వారా ప్రధాన వినియోగ కేంద్రాలకు ఉల్లిపాయలు సరఫరా చేస్తోంది. 2025–26లో ఉల్లిపాయల ఉత్పత్తి అంచనా 307.37 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇది గత ఏడాది ఉత్పత్తి 307.67 లక్షల మెట్రిక్ టన్నులకు ఇది దాదాపు సమానం. దీనివల్ల రాబోయే నెలల్లో దేశీయ అవసరాలకు సరిపడా ఉల్లిపాయల లభ్యత ఉంటుందని భావిస్తున్నారు. మెరుగైన ఉత్పత్తి, బఫర్ స్టాక్‌ల లభ్యత, మార్కెట్‌లో ముందస్తు చర్యల కారణంగా... రాబోయే నెలల్లో తగినంత సరఫరా ఉంటుందనీ, సీజనల్ ధరల ఒత్తిడి నియంత్రణలో ఉంటుందనీ అంచనా. ఉత్పత్తికి సంబంధించిన ఈ సానుకూల పరిస్థితుల దృష్ట్యా... 2026–27 సంవత్సరానికి గానూ 'ధరల స్థిరీకరణ నిధి' బఫర్ కోసం రబీ సీజన్ ద్వారా 2.00 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలను సేకరించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఈ సేకరణ ప్రక్రియ నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ ద్వారా 2026 మే 15న ప్రారంభమైంది. ఇప్పటివరకు బఫర్ కోసం సుమారు 1.21 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలు సేకరించారు.

నిల్వల నిర్వహణను, కార్యాచరణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా 2026–27 సంవత్సరానికి గానూ పీఎస్‌ఎఫ్ ఉల్లిపాయల బఫర్ నిల్వల ఏజెన్సీగా సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ)ని మొదటిసారిగా నియమించారు. ఓనం, గణేశ చతుర్థి, దుర్గా పూజ, దసరా, దీపావళి వంటి పండగలతో పాటు వివాహాల సీజన్ కావడంతో... అధిక డిమాండ్, సరఫరా వ్యవస్థ సంబంధిత అంశాల కారణంగా ఉల్లి ధరలు సాధారణంగా ఈ సమయంలో పెరుగుతుంటాయి. అవసరానికి అనుగుణంగా, అత్యంత నియంత్రిత విధానంలో బఫర్ ఉల్లి నిల్వల విడుదలతగినంత లభ్యతను నిర్ధారించడం, ధరల హెచ్చు తగ్గులను నివారించడం లక్ష్యంగా ప్రభుత్వం బఫర్ స్టాక్ నుంచి అవసరానికి అనుగుణంగా, అత్యంత నియంత్రిత విధానంలో ఉల్లి నిల్వలను విడుదల చేయడం ప్రారంభించింది. ప్రధాన వినియోగ కేంద్రాలకు ఉల్లిపాయల రవాణాను సులభతరం చేస్తూ... రైల్వే ర్యాక్‌లు, రోడ్డు రవాణాతో కూడిన హైబ్రిడ్ రవాణా నమూనా ద్వారా ఈ సరఫరా కొనసాగుతోంది.

# పాత పెన్షన్ హామీ మరిచారా..

ఆదిలాబాద్, ఆగష్టు 28: అధికారంలోకి వచ్చిన తర్వాత పాత పెన్షన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం మరిచిందా అని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీపీఎస్ కృష్ణారావు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు సీపీఎస్‌పై ముందడుగు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు నెలకు రూ. 2 వేలు, రూ. 3 వేలు మాత్రమే పెన్షన్ వస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చట్టసభల సభ్యులకు పెన్షన్ ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు పెన్షన్ తీసుకుంటూ ఉద్యోగుల పెన్షన్‌ను తొలగించడం అన్యాయమని అన్నారు. కుటుంబ పెన్షన్ జీవోకు సవరణ చేయాలని, ఒకే విడతలో డీఏ బకాయిలను చెల్లించాలని కృష్ణారావు కోరారు. పాత పెన్షన్ సాధన కోసం అవసరమైతే ఆమరణ దీక్షకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



# చెన్నైలో 7వ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్న భారత్, వియత్నాం తీర రక్షక దళాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 28:'తీర రక్షక దళాలకు సంబంధించిన 2015 అవగాహన ఒప్పందం' ప్రాథమిక ప్రణాళికలో భాగంగా.. 2026 ఆగస్టు 25న చెన్నైలో నిర్వహించిన 7వ ఉన్నత స్థాయి సమావేశం (హెచ్ఎల్ఎమ్)లో భారతీయ తీర రక్షక దళం, వియత్నాం తీర రక్షక దళం పాల్గొన్నాయి.

ఈ సమావేశానికి భారతీయ తీర రక్షక దళం డైరెక్టర్ జనరల్ పరమేశ్ శివమణి, వియత్నాం తీర రక్షక దళం వైస్ కమాండెంట్ మేజర్ జనరల్ లువోంగ్ దిన్హ్ హంగ్ సహాధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో.. మారిటైం సెర్చ్ అండ్ రెస్క్యూ (ఎస్ఏఆర్), నౌకావాణిజ్య నేర నియంత్రణ, నౌకావాణిజ్య కాలుష్య ప్రతిస్పందన, సామర్థ్యాల పెంపుదల సహా కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై ప్రధానంగా చర్చించారు.

వృత్తినిపుణుల బృందాల మార్పిడి, నౌకల రాకపోకలు, ప్రస్తుతం అమలవుతున్న ద్వైపాక్షిక ఒప్పందాలను ఇరు పక్షాలూ సమీక్షించాయి. సహకారాన్నీ, ఇతర వ్యవస్థలతో కలిసి పనిచేయగల సామర్థ్యాన్నీ ఇప్పటికన్న మరింత విస్తరింపచేసుకోవాలన్న ఆసక్తిని పునరుద్ఘాటించాయి.

విశ్వాసాన్నీ, సమన్వయాన్నీ, కార్యకలాపాల సంబంధిత సహకారాన్నీ మరింత పటిష్ఠపరుచుకొనే లక్ష్యంతో క్రమం తప్పక సంస్థాగత సమావేశాలను, శిక్షణ కార్యక్రమాలను, వృత్తినిపుణుల పర్యటనలను నిర్వహించడం, అత్యుత్తమ పద్ధతులను పరస్పరం పంచుకోవడంతో పాటు రెండు దేశాలకూ చెందిన నౌకల రాకపోకలకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఉభయ తీర రక్షక దళాలూ పునరుద్ఘాటించాయి.

నౌకావాణిజ్య సంబంధిత సురక్ష, భద్రత, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించే దిశగా మైత్రి, సహకార స్ఫూర్తితో కలిసి పనిచేసే విషయంలో భారత్, వియత్నాం ఉమ్మడి నిబద్ధతను ఈ 7వ ఉన్నత స్థాయి సమావేశంలో పునరుద్ఘాటించారు.

ప్రస్తుత ద్వైపాక్షిక సహకారంలో భాగంగా భారత్, వియత్నాం తీర రక్షక దళాల సంయుక్త విన్యాసం 'సహ్‌యోగ్-హెచ్ఓపీటీఏసీ'ని రేపు, అంటే 2026 ఆగస్టు 27న ఏర్పాటు చేయనున్నారు. ఈ విన్యాసం రెండు తీరరక్షక దళాలకూ కార్యకలాపాల సమన్వయాన్నీ, ఇతర వ్యవస్థలతో కలిసి పనిచేయగల సామర్థ్యాన్నీ, అలాగే అత్యుత్తమ పద్ధతుల్నీ పరస్పరం పంచుకొనేందుకు ఒక అవకాశాన్ని అందించనుంది.

## 6 కోర్సులకు ఉపకార వేతనాలు... కథా రచయితలకు ఐఐసీటీ, నెట్‌ఫ్లిక్స్ మద్దతు

న్యూఢిల్లీ, ఆగష్టు 28: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ), నెట్‌ఫ్లిక్స్ సంస్థలు... ఒక సంవత్సరం డిప్లొమా, నాలుగు, ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సులతో కూడిన ఆరు ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌ల కోసం 80 శాతం వరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ, 100 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను ప్రకటించాయి.

ఇంటరాక్టివ్ కామిక్స్-సీక్వెన్షియల్ ఆర్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్ మాస్టరీలలో డిప్లొమాలు... వర్చువల్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్ కంటెంట్ క్రియేషన్, మీడియా టెక్ వర్క్‌ఫ్లో, ఆర్ట్ ఆఫ్ క్యారెక్టర్ యానిమేషన్, ఇ-స్పోర్ట్స్- గేమింగ్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికేట్ కోర్సులు ఈ ఉపకార వేతన పథకం కింద చేర్చిన ఆరు ప్రోగ్రామ్‌లలో భాగంగా ఉన్నాయి.

2026 ఆగస్టు 5న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, నెట్‌ఫ్లిక్స్ సహ-సీఈవో శ్రీ టెడ్ సరండోస్‌ల మధ్య జరిగిన సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. కథలు అద్భుతంగా వర్ణించి చెప్పగల గొప్ప సంప్రదాయం, అసాధారణ సృజనాత్మకత కలిగిన ప్రతిభావంతులు భారత్ సొంతమనీ... కంటెంట్ సృష్టికి ప్రపంచ కేంద్రంగా మన దేశ స్థానాన్ని బలోపేతం చేయడానికి వీరిని వినియోగించుకోవచ్చని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భారత సృజనాధారిత ఆర్థిక వ్యవస్థకు కీలక చోదకంగా పనిచేసే యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్- కామిక్స్ (ఏవీజీసీ) రంగంలో పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలతో తదుపరి తరం కథకులను సన్నద్ధం చేయడం ద్వారా... భారతీయ సృజనాత్మక ప్రతిభావంతులను తీర్చిదిద్దడంలో పెట్టుబడి పెట్టాలనే లక్ష్యంతో నెట్‌ఫ్లిక్స్ ఇండియా స్టోరీ టెల్లింగ్ ఇనిషియేటివ్‌ను ప్రారంభించారు.

దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, ఉద్యోగస్తులకూ ఈ ఉపకార వేతనాలు అందుబాటులో ఉంటాయి. ఐఐసీటీ అందించే విజువల్ ఎఫెక్ట్స్ మాస్టరీ, మీడియా టెక్ వర్క్‌ఫ్లో ప్రోగ్రామ్‌ల పాఠ్యప్రణాళికను... నెట్‌ఫ్లిక్స్ అందించిన సూచనలతో, సమకాలీన పరిశ్రమ వర్క్‌ఫ్లోలు, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా రూపొందించారు.

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఐఐసీటీ బోర్డు ఛైర్మన్ శ్రీ చంచల్ కుమార్ మాట్లాడుతూ... "భారత సృజనాధారిత ఆర్థిక వ్యవస్థ కీలక దశలో ఉంది. సాంకేతికత కథలను సృష్టించే విధానాన్ని మారుస్తున్నందున, తదుపరి తరం ప్రతిభను తీర్చిదిద్దే సంస్థలూ దానికి అనుగుణంగా పరిణామం చెందాలి. దేశంలోని అపారమైన సృజనాత్మక ప్రతిభకు, వేగంగా మారుతున్న ప్రపంచ ఏవీజీసీ-ఎక్స్ఆర్ పరిశ్రమ అవసరాలకు మధ్య వారధిగా ఐఐసీటీని రూపొందించారు. ఆ వారధిని నిర్మించడంలో ప్రముఖ ప్రపంచ స్థాయి సంస్థలతో భాగస్వామ్యాలు కీలకం. ఇటువంటి సహకారాలు పరిశ్రమ పరిజ్ఞానాన్ని తరగతి గదిలోకి తీసుకువస్తాయి. భారత ప్రతిభను రేపటి సృజనాత్మక శ్రామిక శక్తిగా తీర్చిదిద్దడంలోనూ సహాయపడతాయి.''ఐఐసీటీ సీఈవో డాక్టర్ విశ్వాస్ డియోస్కర్ మాట్లాడుతూ... "ఐఐసీటీ వంటి సంస్థ ఉద్దేశం నైపుణ్యాలను అందించడంతో పాటు, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ విధానానికి ఆ నైపుణ్యాలు ఉపయోగపడేలా ఉండేలా చూడటం. నెట్‌ఫ్లిక్స్‌తో ఈ సహకారం ఆ పరిశ్రమ దృక్పథాన్ని నేరుగా మా పాఠ్యప్రణాళిక రూపకల్పన విధానంలోకి తీసుకువస్తుంది. నిర్మాణాత్మక విద్యను, పరిశ్రమ ప్రత్యక్ష సహకారాన్ని, ఆర్థిక వనరుల లభ్యతను అనుసంధానించడం ద్వారా... అభివృద్ధి చెందుతున్న భారత సృజనాధారిత ఆర్థిక వ్యవస్థకు దోహదపడేందుకు సిద్ధంగా ఉన్న ప్రతిభావంతుల బలమైన వ్యవస్థను రూపొందించాలనే లక్ష్యాన్ని మేం నిర్దేశించుకున్నాం" అని అన్నారు.

# ఘజియాబాద్‌లోని లోనిలో ప్రత్యేక ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సీఏక్యూఎమ్




న్యూఢిల్లీ, ఆగష్టు 28:జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలోని చట్టవిరుద్ధమైన, కాలుష్యకారక పారిశ్రామిక యూనిట్లలో... ఎన్‌సీఆర్-పరిసర ప్రాంతాల వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎమ్) ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది, 'ఆపరేషన్ క్లీన్ ఎయిర్' కింద నిన్న ఘజియాబాద్‌లోని లోనిలో కమిషన్ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. పర్యావరణ నియంత్రణ యంత్రాంగాల పరిమితులను పట్టించుకోకుండా చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న యూనిట్లను గుర్తించడం లక్ష్యంగా ఈ తనిఖీ డ్రైవ్‌ను చేపట్టారు.

ఘజియాబాద్‌లోని లోని ప్రాంతంలో ఉన్న 28 పారిశ్రామిక ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహించడానికి... కమిషన్ ఆధ్వర్యంలో మెజిస్ట్రేట్లు, పోలీసులు, ఉత్తర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో కూడిన ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ తనిఖీల్లో విస్తృతమైన నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. తనిఖీ చేసిన 28 ప్రాంగణాలు పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా లేవని తేలింది.

కార్యకలాపాల నిర్వహణ కోసం చెల్లుబాటయ్యే అనుమతి (సీటీవో) లేకుండా పనిచేస్తున్న 21 కేసులు... కలప, బొగ్గు వంటి ఆమోదం లేని ఇంధనాలను ఉపయోగించిన 14 కేసులు... అవసరమైన వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు (ఏపీసీడీలు), స్టాక్/చిమ్నీ ఏర్పాట్లు లేకుండా కొలిమిలను నడుపుతున్న, వాయు కాలుష్య నియంత్రణ మౌలిక సదుపాయాలు తగినంతగా లేకుండా పారిశ్రామిక కార్యకలాపాలను నిర్వహిస్తున్న 8 కేసులను ఈ తనిఖీల్లో భాగంగా గుర్తించారు. బహిరంగంగా పెయింటింగ్/పౌడర్-కోటింగ్ కార్యకలాపాలు నిర్వహించడం, పారిశ్రామిక యూనిట్లను చట్టవిరుద్ధంగా నడపడం వంటి ఉదంతాలూ వెలుగుచూశాయి.

ఉల్లంఘనలను గుర్తించిన 16 యూనిట్లు/ప్రాంగణాలను జిల్లా పరిపాలన, ఫ్లయింగ్ స్క్వాడ్, యూపీపీసీబీ సిబ్బంది సీజ్ చేశారు. సంబంధిత యూనిట్‌లకు 6 ప్రాథమిక నివేదికలు/షోకాజ్ నోటీసులు అందించారు. మరో 6 యూనిట్‌లకు తాళం వేసి ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఆయా ఆవరణ/తలుపులపై నోటీసులు అతికించారు. తనిఖీ చేసే అధికారుల రాకను గమనించి కొందరు స్థానికులు ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు.

ఎన్‌సీఆర్‌లో పనిచేస్తున్న పారిశ్రామిక యూనిట్లు వర్తించే అన్ని పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కమిషన్ పునరుద్ఘాటించింది. చెల్లుబాటయ్యే చట్టబద్ధమైన అనుమతులు లేకుండా పారిశ్రామిక కార్యకలాపాలను నిర్వహించడం, ఆమోదం లేని ఇంధనాలను ఉపయోగించడం, అవసరమైన వాయు కాలుష్య నియంత్రణ ఏర్పాట్లు లేకుండా కొలిమిలు/ప్రక్రియలను కొనసాగించడం వంటివి తీవ్రమైన ఉల్లంఘనలుగా పరిగణిస్తారు. ఇలాంటి ఉల్లంఘనల విషయంలో కఠినమైన చర్యలు తీసుకుంటారు.

క్షేత్రస్థాయిలో నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయా పర్యవేక్షించడానికి, ఉల్లంఘనలపై సకాలంలో దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి వీలుగా... ఆపరేషన్ క్లీన్ ఎయిర్ కింద ఎన్‌సీఆర్ అంతటా తనిఖీలు, సోదాలు కొనసాగుతాయని కమిషన్ మరోసారి స్పష్టం చేసింది. సంబంధిత ఏజెన్సీలు నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించిన యూనిట్లపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొనాలి : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కరీంనగర్, ఆగష్టు 28: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప దేవస్థాన ట్రస్టు ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కోటి కుంకుమ అర్చన, ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనసుకు ప్రశాంతతను కలిగించడంతో పాటు భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

# బేడ బుడగ జంగాల కమ్యూనిటీ హాల్ ప్రారంభం..



ఖమ్మం, ఆగష్టు 28: ఖమ్మం నగరంలోని 22వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన బేడ బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌ను టీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, గౌడ సంఘం నాయకులు, బేడ బుడగ జంగాల సంఘం నాయకుల సమక్షంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నగర టీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు పల్లా రోస్లిన్, మక్బూల్, పగడాల శ్రీవిద్య, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు అమరగాని వెంకన్న గౌడ్ తదితరులు హాజరై కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బేడ బుడగ జంగాల కమ్యూనిటీకి ఉపయోగకరంగా ఉండేలా నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పటి మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి సంఘానికి అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు బేడ బుడగ జంగాల సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గతంలో ఈ ప్రాంతానికి సంబంధించిన రెండు డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసిన కార్పొరేటర్లకు బేడ బుడగ జంగాల సంఘం నాయకులు, సభ్యులు, ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా ఆదరించి అండగా నిలిచారని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా పువ్వాడ అజయ్‌కుమార్ విజయానికి కూడా బేడ బుడగ జంగాల సంఘం, ఆ సామాజిక వర్గం అందించిన సహకారం, ఆదరణ మరువలేనిదని తెలిపారు.

రాబోయే రోజుల్లోనూ బేడ బుడగ జంగాల సంఘం నాయకులు, సభ్యులు, ఆ సామాజిక వర్గం నుంచి ఇదే విధమైన ఆదరణ, సహకారం కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బేడ బుడగ జంగాల కమ్యూనిటీకి ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వచ్చిన సందర్భంగా సంఘం నాయకులు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటయ్య రాజు, బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు మాటేటి కిరణ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే దశాబ్దంలో భారత్‌లో 10 ట్రిలియన్ జపాన్ యెన్‌ల ప్రైవేట్ పెట్టుబడులకు గోయల్ పిలుపు

న్యూఢిల్లీ, ఆగష్టు 28:కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ జపాన్‌లో తన పర్యటనను ముగించుకున్నారు. దేశంలో జపాన్ పెట్టుబడులను మరింత పెంచడం, పారిశ్రామిక భాగస్వామ్యాల బలోపేతం, ఆధునిక-వ్యూహాత్మక రంగాల్లో ద్వైపాక్షిక ఆర్థిక సహకారం విస్తరణ తదితర లక్ష్యాలతో టోక్యో, నగోయా, ఒసాకా నగరాల్లో సాగిన ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు ఉన్నత స్థాయి సమావేశాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జపాన్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్థిక సంస్థలు, వ్యాపారవేత్తలతో శ్రీ గోయల్ విస్తృతంగా చర్చలు నిర్వహించారు. భారత్‌లో పెట్టుబడులు లేదా గణనీయ ప్రయోజనాలపై ఆసక్తి చూపుతున్న 30కి పైగా ప్రధాన కంపెనీలు, ఆర్థిక సంస్థల అధికార ప్రతినిధులు కూడా వీరిలో ఉన్నారు. పెట్టుబడుల విస్తరణ, పటిష్ఠ సరఫరా వ్యవస్థల బలోపేతం, సాంకేతిక భాగస్వామ్యాల విస్తృతి, రెండు దేశాల వ్యాపార సంస్థల మధ్య సహకారానికి కొత్త మార్గాల అన్వేషణపై ఈ సమావేశాల్లో దృష్టి సారించారు. భారత్ కోసం జపాన్ దీర్ఘకాలిక సంస్థాగత మూలధన సమీకరణ శ్రీ గోయల్ పర్యటనలో ఒక ముఖ్యాంశంగా ఉంది. ఈ మేరకు ఆయన ఇతరత్రా ప్రధాన పెట్టుబడి-ఆర్థిక సంస్థలు సహా 'ఎంయూఎఫ్‌జీ, మిజుహో, నోమురా, నిప్పన్ లైఫ్, డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ జపాన్, మోర్గాన్ స్టాన్లీ, ఎంయూఎఫ్‌జీ సెక్యూరిటీస్ వంటి ప్రసిద్ధ జపాన్ ఆర్థిక సంస్థలతో సమావేశమయ్యారు. భారత్‌కు మూలధన సమీకరణ మరింత పెంపు, అలాగే దేశంలో విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, తయారీ, సాంకేతికత, ఆర్థికావరణ వ్యవస్థకు మద్దతిచ్చేందుకు గల అవకాశాలపై ఈ చర్చల సందర్భంగా దృష్టి సారించారు.

మరోవైపు మూలధన వస్తువులు, యంత్రాలు, ఆటోమోటివ్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, అంకుర సంస్థలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల రంగాలవారీ రౌండ్‌టేబుల్ సమావేశాలకు శ్రీ గోయల్ అధ్యక్షత వహించారు. జపాన్- భారత్ వాణిజ్య సంస్థలకు చెందిన విస్తృత వర్గాలను ఈ సమావేశాలు ఒకే వేదికపైకి తెచ్చాయి. ముఖ్యంగా భారత్‌లోని 2, 3 అంచెల నగరాల్లో సరఫరాదారుల వ్యవస్థ, 'ఎంఎస్ఎంఈ'లు సహా నిర్దిష్ట పెట్టుబడి, సాంకేతిక- వాణిజ్య భాగస్వామ్యాలను గుర్తించడంలో ఈ సమావేశాలు ఎంతగానో ఉపకరించాయి.

సెమీకండక్టర్, ఏఐ రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా 2032 నాటికి సెమీకండక్టర్ల డిమాండ్ 150 బిలియన్ డాలర్లకు చేరుతుందన్న అంచనాల నడుమ ప్రపంచవ్యాప్త పోటీతత్వంతో సెమీకండక్టర్ల వ్యవస్థను రూపొందించాలన్న భారత్ ఆకాంక్షను శ్రీ గోయల్ ప్రస్ఫుటం చేశారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ యంత్రాలు, మెటీరియల్స్, ఫ్యాబ్రికేషన్, ఏటీఎంపీ/ఓఎస్ఏటీ, పరిశోధన-అభివృద్ధి, ప్రతిభ-ప్రగతి వంటి భారత ఆరు స్తంభాల వ్యూహాన్ని ఈ సమావేశాల్లో ఆయన వివరించారు.

భారత్‌లో గల విస్తృత నైపుణ్యం, యువ ప్రతిభావంతులతో జపాన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇంజినీరింగ్ నైపుణ్యం, తయారీ సామర్థ్యం జోడుకడితే భారత్‌లో ప్రపంచ స్థాయి సెమీకండక్టర్-సాంకేతిక విప్లవం వేగిరం కాగలదని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. సెమీకండక్టర్ తయారీ, కృత్రిమ మేధ, డేటా సెంటర్ల వంటి అధిక ఇంధన వినియోగ పరిశ్రమలకు భారత్‌లో విస్తరిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, పటిష్ఠ జాతీయ విద్యుత్ గ్రిడ్ కీలక ఉపకరణాలు కాగలదని ఆయన ప్రకటించారు.

భారత్‌లో సెమీకండక్టర్ మెటీరియల్స్, పరికరాలు, పవర్ సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్ సంబంధిత అధునాతన సాంకేతికతల రంగాల్లో తమ కార్యకలాపాల విస్తరణపై సెమీకండక్టర్, ఏఐ చర్చలలో పాల్గొన్న జపాన్ కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. ధోలేరా, సనంద్ వంటి పురోగమిస్తున్న సెమీకండక్టర్ సముదాయాల్లో విశ్వసనీయ విద్యుత్తు, నీటి సరఫరా, నిపుణ మానవ వనరులు, సామాజిక మౌలిక సదుపాయాలు సహా అనుబంధ సౌకర్యాలపైనా చర్చల్లో దృష్టి సారించారు. జపాన్ ఆర్థిక-వాణిజ్య- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ అకాజావా ర్యోసేతో పాటు జెట్రో, జేబీఐసీ, జైకా సంస్థల సీనియర్ ప్రతినిధులతోపై శ్రీ గోయల్ చర్చల్లో పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, పటిష్ఠ సరఫరా శ్రేణులు, తయారీలో సహకారం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు సహా భారత్ ప్రగతి ప్రస్థానంలో జపాన్ కంపెనీలకు మరింత భాగస్వామ్యం వగైరా అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి.

# 'సంకల్ప్ సే సిద్ధి కా మోదీ యుగ్' పుస్తకం సంకల్పం నుంచి సాధన దిశగా భారత్ ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 28:రాజ్యసభ ఎంపీ శ్రీ ఘనశ్యామ్ తివారీ రచించిన 'సంకల్ప్ సే సిద్ధి కా మోదీ యుగ్' పుస్తకాన్ని న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు విడుదల చేశారు.

'సంకల్ప్ సే సిద్ధి కా మోదీ యుగ్' అనే శీర్షిక శక్తిమంతమైన, స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని కలిగి ఉందని శ్రీ సి. పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. సంకల్పం కేవలం ఒక కోరిక మాత్రమే కాదని... అది అంకితభావం, కఠోర శ్రమ, క్రమశిక్షణతో కూడిన దృఢ నిశ్చయమని ఆయన అన్నారు. ఈ పుస్తకం గత పన్నెండేళ్లుగా భారత్ సాధించిన పరిపాలన విజయాలు, సైద్ధాంతిక పునరుజ్జీవనం వంటి ప్రస్థానాన్ని వివరిస్తూ... 'వికసిత్ భారత్ ఏ 2047' దార్శనికత దిశగా సాగుతున్న దేశ ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, వీర్ సావర్కర్, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి గొప్ప జాతీయ చింతనాపరుల భావాలు, ఆదర్శాలను సమకాలీన పాలనతో అనుసంధానించడానికి ఈ పుస్తకంలో జరిగిన కృషిని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ఆ చింతనాపరుల సంకల్పానికి, నేటి భారతంలో దాని సాకారానికి మధ్య అనుసంధానాన్ని ప్రతిబింబిస్తూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని 'సేతు పురుష్' (కలలకు, వాస్తవానికి మధ్య వారధి)గా రచయిత సముచితంగా అభివర్ణించారని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హయాంలో జరిగిన కీలక పరిణామాలను గుర్తుచేసుకుంటూ... ఈ పుస్తకం 'దేశం ప్రథమం', 'సమగ్ర మానవతా వాదం', 'అంత్యోదయ' స్ఫూర్తిని ఏకతాటిపైకి తెస్తుందని శ్రీ సి. పి. రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. జాతీయ సమగ్రత, సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, మహిళల నేతృత్వంలోని అభివృద్ధి, స్వయం సమృద్ధ భారత్, పారదర్శక పాలన వంటి అంశాలను శ్రీ సి. పి. రాధాకృష్ణన్ ప్రముఖంగా ప్రస్తావించారు. శాశ్వత జాతీయ భావనలను ఆచరణలోకి తీసుకువచ్చే ప్రయత్నంగా ఈ రచన వివిధ పాలనాపరమైన కార్యక్రమాలను ప్రదర్శిస్తోందన్నారు. భారత ప్రస్థానం గురించి ఆలోచించి, ఆత్మవిశ్వాసంతో, ఆశావాదంతో భవిష్యత్తు వైపు చూడమని పాఠకులను ఇది ప్రోత్సహిస్తుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్... రాజ్యసభ ఎంపీ, రచయిత శ్రీ ఘనశ్యామ్ తివారీ... రాజ్యసభ ఎంపీ శ్రీ లహర్ సింగ్ సిరోయా, ప్రభాత్ ప్రకాశన్ నుంచి శ్రీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఛాంపియన్లుగా నిలవడమే కాదు.. అత్యుత్తమ పోటీదార్లుగా ఎదగడాన్నీ క్రీడలు బోధిస్తాయి

న్యూఢిల్లీ, ఆగష్టు 28:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'ఖేలో ఇండియా చర్చ'లో పాల్గొన్నారు. ఇంతటి బృహత్తరమైన కార్యక్రమ నిర్వాహకులనూ, కేంద్ర మంత్రివర్గ సభ్యులనూ, ముఖ్యమంత్రులనూ, లక్షలాది మంది పై భారత్ స్వచ్ఛంద కార్యకర్తలనూ ప్రధానమంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. దేశవ్యాప్తంగా ఉన్న యువతకూ, క్రీడా రంగంతో అనుబంధమున్న ప్రతి ఒక్కరికీ ఆయన ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. "అలాగే ఈ రోజు భరతమాత ముద్దుబిడ్డ మేజర్ ధ్యాన్‌చంద్‌ను కూడా స్మరించుకోవాలి" అని శ్రీ మోదీ అన్నారు.

శతాబ్దం కిందటి భారత ఆర్మీ హాకీ జట్టు చరిత్రాత్మక న్యూజిలాండ్ పర్యటనను ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలను నెలకొల్పడంలో మేజర్ ధ్యాన్ చంద్ కీలక పాత్ర పోషించిన తీరును కొనియాడారు. ఇటీవల తాను న్యూజిలాండ్‌లో పర్యటించిన సమయంలో ఆ మహనీయుడి స్మృతికి నివాళి అర్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. నాటి చరిత్రాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. "మేజర్ ధ్యాన్‌చంద్ వేసిన ఆ సంబంధాల పునాదులను.. మరింత బలోపేతం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లడానికి భారత్ నేడు నిరంతరం కృషి చేస్తోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా తాను ప్రకటించిన క్రీడా సంకల్పాన్ని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. క్రీడల ప్రాధాన్యం పతకాలు గెలవడానికి మాత్రమే పరిమితం కాదని ఆయన స్పష్టం చేశారు. వికసిత భారత్ నిర్మాణం దిశగా దేశంలోని క్రీడా శక్తినీ, యువశక్తినీ ఏకం చేసే దిశగా ముఖ్యమైన సాధనంగా క్రీడలను అభివర్ణించారు. 'ఆడే వారే రాణిస్తారు' అని తానెప్పుడూ చెబుతుంటానని శ్రీ మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

క్రీడల్లో విజయానికి ఉన్న విస్తృతమైన అర్థాన్ని ప్రధానమంత్రి వివరించారు. ఈ విజయం వ్యక్తిత్వాన్నీ, కుటుంబ గౌరవాన్నీ, దేశ ప్రతిష్ఠనూ ఇనుమడింపజేస్తుందన్నారు. ఒక్క ఆటగాడి విజయం.. వారి పాఠశాల, జిల్లా, రాష్ట్రం ప్రతిష్ఠను పెంచుతుందనీ, స్థానిక ప్రాంతాలకు ప్రపంచ పటంలో సముచిత స్థానాన్ని కల్పిస్తుందనీ ఆయన వ్యాఖ్యానించారు. "ప్రపంచ క్రీడా పటంలో తనదైన ముద్ర వేసే సామర్థ్యం ప్రతి జిల్లాకూ ఉంది. ఈ అపారమైన సామర్థ్యాన్ని అవగతం చేసుకుంటూ.. మనం ఈ చర్చా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి'' అని శ్రీ మోదీ ఆకాంక్షించారు.

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తాను లేవనెత్తిన ఒక ముఖ్యమైన సవాలును శ్రీ మోదీ ప్రస్తావించారు. దాదాపు సగం ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ ఇంతవరకు కనీసం పాల్గొనలేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. 2012 ఒలింపిక్స్‌ను ఉదాహరణగా చూపుతూ.. అందులో భారత్ 13 క్రీడల్లో మాత్రమే పోటీపడిందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉన్న 20కి పైగా క్రీడలను విస్మరించడం వల్లే పతకాల పట్టికలో దేశం వెనుకబడుతోందన్నారు. "మన పతకాల సంఖ్యను పెంచుకోవాలంటే.. ఆ క్రీడల్లో కూడా మనం కచ్చితంగా ప్రావీణ్యం సాధించి తీరాలి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

దేశంలోని అపారమైన సామర్థ్యాన్ని విస్తృతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రధానమంత్రి అన్నారు. సర్ఫింగ్, స్పోర్ట్స్ క్లైంబింగ్, శీతాకాల క్రీడల వంటి ఆటలకు ఎంతో అనువైన విస్తారమైన తీరప్రాంతాలు, పర్వత ప్రాంతాలు ఉన్నప్పటికీ.. ఆయా క్రీడల్లో అంతర్జాతీయ వేదికలపై భారత్ ఇంకా గుర్తింపును పొందలేకపోతోందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో.. ఆయా ప్రాంతాలకు తగిన విధంగా ప్రత్యేక క్రీడా వ్యవస్థలపై పరిశోధించి, వాటి అభివృద్ధి దిశగా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

2036 ఒలింపిక్స్ కోసం దీర్ఘకాలిక వ్యూహాన్ని వివరిస్తూ.. అనేక క్రీడల్లో అర్హత సాధించగల సామర్థ్యమున్న అథ్లెట్లను తక్షణమే గుర్తించి, వారిని సన్నద్ధులను చేయడం అత్యావశ్యకమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 5 నుంచి 15 సంవత్సరాల వయస్సున్న చిన్నారులు లక్ష్యంగా.. జాతీయస్థాయిలో విస్తృతంగా 'ప్రతిభావంతుల అన్వేషణ'ను ప్రారంభించబోతున్నట్టు ఆయన తెలిపారు. ఆయా క్రీడల పట్ల ఆసక్తీ, నిర్దేశిత దేహ దారుఢ్యమూ ప్రధాన ప్రాతిపదికలుగా ఎంపిక ప్రక్రియ ఉండాలని స్పష్టం చేశారు. "దీని కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు కావాలన్నా అదిస్తాం. ప్రభుత్వం మీకు తోడుగా ఉంటుంది. మీతో భుజం భుజం కలిపి నడుస్తుంది" అని శ్రీ మోదీ భరోసా ఇచ్చారు.

ఆధునిక, 21వ శతాబ్దపు అవసరాలకు తగిన క్రీడా వ్యవసను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఇందులో భాగంగా ప్రత్యేక క్రీడా విశ్వవిద్యాలయాలూ, అధునాతన శిక్షణ కేంద్రాల ఏర్పాటును ఆయన వివరంగా పేర్కొన్నారు. క్రీడా విజ్ఞానం, శిక్షణల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ విధానాలను అందిపుచ్చుకునేలా.. అంతర్జాతీయ సహకారాన్ని ప్రభుత్వం క్రమంగా విస్తరించుకుంటోందని ఆయన గుర్తుచేశారు. ''ప్రతిభను గుర్తించడం నుంచి.. దానిని అంతర్జాతీయ వేదికపై నిలిపే వరకు.. ప్రతి స్థాయిలోనూ పూర్తి మద్దతు లభించే ఒక బలమైన వ్యవస్థను దేశంలో నిర్మిస్తున్నాం" అని శ్రీ మోదీ వివరించారు.

క్రీడారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం స్పష్టంగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 'ఖేలో ఇండియా డైలాగ్'.. ఒక చర్చ మాత్రమే కాదనీ, దేశ క్రీడా దృక్పథానికి క్రియాశీలకంగా రూపుదిద్దే కీలకమైన వేదిక అనీ ఆయన అభివర్ణించారు. దేశ స్వప్నాలతో వ్యక్తిగత లక్ష్యాలను అనుసంధానించుకునేలా.. ఈ చర్చా కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతిభను ఆవిష్కరించే విధానాలు, క్రీడాపాలనపై యువత అభిప్రాయాలు.. ప్రభుత్వ విధాన రూపకల్పనను నేరుగా ప్రభావితం చేయగలవని భరోసా ఇచ్చారు. "యువశక్తి అందించే ఈ వినూత్న ఆలోచనలే.. 'వికసిత భారత్' స్వప్నాన్ని సాకారం చేసే శక్తిగా నిలుస్తాయి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

క్రీడల వల్ల సమాజానికి విస్తృత ప్రయోజనాలున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్నీ, బలమైన కుటుంబ వ్యవస్థలనూ, అత్యుత్తమ పని సంస్కృతినీ పెంపొందించడానికి నిజమైన క్రీడాస్ఫూర్తి అత్యావశ్యకమని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం విజేతలుగా నిలవడం మాత్రమే కాకుండా.. వైఫల్యాలను తట్టుకుని తిరిగి ఏ విధంగా నిలదొక్కుకోవాలో ప్రత్యేకించి నేర్పేది క్రీడారంగం ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు. "ఛాంపియన్లుగా నిలవడమే కాదు.. అత్యుత్తమ పోటీదారుగా ఎదగడాన్ని కూడా క్రీడలు మనకు నేర్పిస్తాయి" అని శ్రీ మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

విప్లవాత్మకమైన పరివర్తన శక్తి క్రీడల సొంతమని శ్రీ మోదీ అన్నారు. అద్భుత ప్రదర్శనతో మన దివ్యాంగ అథ్లెట్లు సత్తా చాటారనీ, జీవితంపైనా, ప్రతికూల పరిస్థితులపైనా సమాజ ఆలోచనా ధోరణిలో సమూల మార్పును వారు తెచ్చారనీ కొనియాడారు. దివ్యాంగ క్రీడాకారుడి విజయం వారి కుటుంబంలో నవోత్తేజాన్ని నింపుతుందన్నారు. కెరీర్ తొలి రోజుల్లో వారి పోరాటానికి అండగా నిలిచిన తల్లిదండ్రులు, తోబుట్టువుల్లో ధైర్యాన్నీ, వారి ఆశయాలనూ ఎన్నో రెట్లు పెంచుతుందనీ ఆయన స్పష్టం చేశారు.

అసామాన్య విజయాలతో పారా అథ్లెట్లు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రధానమంత్రి ప్రశంసించారు. విలువిద్యా క్రీడాకారిణి శీతల్, రెండుసార్లు పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన అవనీ లేఖరా, సుమిత్ అంతిల్, నితేష్ కుమార్, ఝుండూ కుమార్ వంటి పారా అథ్లెట్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయాలు వారి రాష్ట్రాలకూ, మొత్తం దేశానికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలను అందించాయని శ్రీ మోదీ అన్నారు. ''అవనిని కలిసినప్పుడు ఎంతో గర్వంగా ఉంటుంది. ఇలాంటి క్రీడాకారులందరూ మనలో ఎంతో స్ఫూర్తిని నింపుతారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

అత్యుత్తమ జీవన ప్రమాణానికి భరోసానిచ్చేవిగా క్రీడలను ప్రధానమంత్రి అభివర్ణించారు. జీవితకాలపు దేహదారుఢ్యానికీ, క్రీడా తృష్ణకూ అత్యుత్తమ నిదర్శనంగా.. శతాధిక వృద్ధుడైన దిగ్గజ అథ్లెట్ ఫౌజా సింగ్‌ను ఉదాహరించారు. శారీరక శ్రమకూ, సంపూర్ణ ఆరోగ్యానికీ మధ్య బలమైన సంబంధం ఉందనేందుకు ఫౌజాసింగ్ జీవితాన్ని ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. "క్రీడలూ, జీవన ప్రమాణాలూ ఏ విధంగా పరస్పరం అనుసంధానమై ఉన్నాయో చెప్పడానికి ఆయన జీవితమే గొప్ప స్ఫూర్తి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

మాదకద్రవ్యాల వ్యసనం సమాజానికి తీవ్రమైన సవాలుగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేసిన శ్రీ మోదీ – క్రీడల్లో మనస్ఫూర్తిగా లీనమవడం వల్ల లభించే ఆత్మస్థైర్యం.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడానికి కావాల్సిన మానసిక శక్తిని అందిస్తుందన్నారు. యువతలో ఈ వ్యసనాన్ని నిర్మూలించడంలో క్రీడలు ఎంతో అర్థవంతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. "నేడు యువతకు ఈ వ్యసనం అతిపెద్ద సవాలుగా నిలిచిన ఈ తరుణంలో.. దాని నిర్మూలనలో కూడా క్రీడలు అత్యంత అర్థవంతమైన పాత్రను పోషిస్తాయి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

భారత్‌లో క్రీడలు అత్యంత గౌరవప్రదమైన వృత్తిగా ఎదుగుతుండడం పట్ల ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు నేడు ట్రయాథ్లాన్లు, 5కే, 10కే రన్నింగ్ రేసులూ, హైరాక్స్ వంటి దేహదారుఢ్య సవాళ్లలో ఉత్సాహంగా పాల్గొంటూ.. ఒక సాంస్కృతిక మార్పునకు శ్రీకారం చుట్టారన్నారు. శీర్షాసనాన్ని సాధన చేయడం నుంచి సరదాగా పికిల్‌బాల్ ఆడడం వరకు... చదువులు, ఉద్యోగ బాధ్యతలతోపాటు క్రీడలు కూడా ప్రజల దైనందిన జీవితంలో భాగంగా విజయవంతంగా స్థిరపడుతుండడం హర్షణీయమన్నారు. "ఇదొక మార్పు, ఇదొక గొప్ప పరివర్తన. దీని వల్లే దేశ క్రీడా రంగ భవిష్యత్తుపై నమ్మకం కూడా పెరుగుతోంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ దిశగా క్షేత్రస్థాయి నుంచి ప్రజలు భాగస్వాములవడం అత్యావశ్యకమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల్లో క్రీడలను సహపాఠ్య కార్యకలాపంగానే కాకుండా.. జీవితంలో ప్రధానమైన అంశంగా ఈ వ్యాయామ విద్యను గుర్తించినప్పుడే నిజమైన క్రీడా సంస్కృతి రూపుదిద్దుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాథమిక స్థాయిలోనే క్రీడలను ఒక క్రమబద్ధమైన వ్యవస్థగా మార్చడం వల్ల.. జాతీయ స్థాయిలో ప్రతిభావంతుల సంఖ్య పెరగడమే కాకుండా, యువ అథ్లెట్లకు కుటుంబం అండ కూడా లభిస్తుందని ఆయన వివరించారు. "స్క్రీన్ల కన్నా క్రీడా కేంద్రాలు ముఖ్యమైనవి. ప్లేస్టేషన్ల కంటే క్రీడా మైదానాలు ముఖ్యమైనవి" అని శ్రీ మోదీ అన్నారు.

దేశ యువత సామర్థ్యంపై తమకు అపారమైన నమ్మకముందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. మైదానంలోనైనా, సమాజంలోనైనా యువత క్రియాశీల భాగస్వామ్యమే దేశానికి అసలైన శక్తి అని ఆయన ప్రకటించారు. కొత్తరకం క్రీడా పరికరాల రూపకల్పన, అధునాతన క్రీడా సాంకేతికత, స్పోర్ట్స్ మెడిసిన్, పోషకాహారం, సైకాలజీ, అనలిటిక్స్ వంటి రంగాలతో క్రీడా రంగంలో ఉపాధి అవకాశాలు భారీగా విస్తరిస్తున్న విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. "మీరు ఈ అవకాశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ జారవిడుచుకోవద్దు. అందుకే ఈ సంవాదం ద్వారా మీ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయండి" అని శ్రీ మోదీ పిలుపునిచ్చారు.

## పోలీస్ స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలు

### ఎస్సై సతీష్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళా కానిస్టేబుళ్లు

### కుటుంబ వాతావరణంలో ప్రేమానురాగాలతో పండుగ సంబరాలు



నల్గొండ, ఆగష్టు 28:మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు పరస్పరం రాఖీలు కట్టుకుని ప్రేమానురాగాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పోచంపల్లి సతీష్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తోబుట్టువుల మధ్య ఆప్యాయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను స్టేషన్ అధికారులు, సిబ్బంది ఒకే కుటుంబ సభ్యుల్లా ఉత్సాహంగా జరుపుకున్నారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు దివ్య, శ్రావణి ఎస్సై సతీష్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు తినిపించి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు సందీప్, రంజిత్, లాల్‌సింగ్, రాజు, హోంగార్డు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు అందుబాటు ధరలో ఉల్లిపాయలు లభించేలా తగిన మార్కెట్ జోక్యంతో చర్యలు

న్యూఢిల్లీ, ఆగష్టు 28: వినియోగదారులకు అందుబాటు ధరల్లో తగినంత పరిమాణంలో ఉల్లిపాయలు లభించేలా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఢిల్లీ – ఎన్‌సీఆర్ పరిధిలో రిటైల్ ఔట్‌లెట్లు, మొబైల్ పంపిణీ కేంద్రాల ద్వారా బఫర్ నిల్వల నుంచి ఉల్లిపాయలను కిలో రూ. 35 చొప్పున అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈ చర్యలు చేపట్టారు. వినియోగదారులకు ఉల్లిపాయలు సులభంగా అందుబాటులో ఉండేలా చూడటం, ధరల ఒత్తిడిని నియంత్రించడం, మార్కెట్‌లో తగినంత పరిమాణంలో ఉల్లిపాయలు అందుబాటులో ఉండేలా చూడటం ఈ చర్యల ప్రధాన ఉద్దేశం.

కాందా ఎక్స్‌ప్రెస్' రైలు ద్వారా ఉత్పత్తి ప్రాంతాల నుంచి ప్రధాన వినియోగ కేంద్రాలకు బఫర్ నిల్వల్లోని ఉల్లిపాయలను తరలించడం ద్వారా రవాణా వ్యవస్థను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. 2024-25లో 14 రైల్వే రేక్‌ల ద్వారా దాదాపు 12,000 మెట్రిక్ టన్నుల బఫర్ ఉల్లిపాయలను ఐదు నగరాలకు తరలించారు. 2025-26లో ఈ కార్యక్రమాన్ని గణనీయంగా విస్తరించి, 86 రైల్వే రేక్‌ల ద్వారా సుమారు 88,000 మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలను దేశవ్యాప్తంగా 16 నగరాలకు తరలించారు.

ఈ తాత్కాలిక జోక్యంలో భాగంగా, ఉల్లి నిల్వలను రైలు, రోడ్డు మార్గాల ద్వారా రవాణా చేస్తున్నారు. బఫర్ ఉల్లి నిల్వలను శాస్త్రీయ పద్ధతుల్లో భద్రపరచడానికీ, సమర్థవంతంగా పంపిణీ చేయడానికి సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ సేవలను కూడా ఈ వ్యవస్థలో భాగస్వామ్యం చేశారు.

## తొలి స్వదేశీ బహుళార్థసాధక నౌక 'సమర్థక్' నావికా దళానికి అప్పగింత

న్యూఢిల్లీ, ఆగష్టు 28: కట్టుపల్లిలోని లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్ (ఎల్ అండ్‌టి) సంస్థ నిర్మించిన తొలి దేశీయ బహుళార్థ సాధక నౌక (ఎంపీవీ) 'సమర్థక్'ను ఇవాళ భారత నావికాదళానికి అప్పగించారు.

ఈ నౌకలో 75 శాతానికి పైగా పరికరాలు దేశీయంగానే రూపొందించినవి కాగా, దీన్నొక విభిన్న ప్రయోగాలు, పరీక్షలు నిర్వహించగల వేదికగా తయారు చేశారు. అలాగే, అవసరమైనప్పుడు సముద్ర నిఘా-గూఢచర్యం, తీరప్రాంత గస్తీ, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలకు తోడ్పడే విధంగా ఈ నౌకను అత్యాధునికంగా తీర్చిదిద్దారు.

ఈ నౌకకు 'సమర్థక్' (అండగా నిలిచేవాడు) అని నామకరణం చేయడం ఎంతయినా సముచితం. బహుళ వ్యూహాత్మక లక్ష్యాలను విజయవంతంగా ఛేదించడంలో విశ్వసనీయ సాధనంగా నిలవాలనే ప్రధానోద్దేశాన్ని ఈ పేరు ప్రస్ఫుటం చేస్తుంది. అందుకు తగినట్టుగానే 'సమర్థక్' ఏదో ఒక నిర్దిష్ట లక్ష్యం కోసం కాకుండా విస్తృత శ్రేణి కార్యకలాపాల నిర్వహించగలిగేలా అత్యాధునికంగా రూపొందింది. తద్వారా 'బహుళోపయోగ నౌక' భావనకు నిదర్శనంగా నిలుస్తోంది. భారత నావికాదళం కోసం స్వదేశీ నౌకా నిర్మాణ ప్రస్థానంలో 'సమర్థక్' అప్పగింత ఓ కీలక మలుపు. స్వయంసమృద్ధ భారత్ దిశగా ప్రభుత్వ సంకల్పాన్ని ఇది పునరుద్ఘాటిస్తుంది. స్వావలంబన గల రక్షణ పారిశ్రామిక వ్యవస్థ సాకారం కోసం భారత్ కృషికి ఈ నౌక ఒక నిదర్శనమనడంలో సందేహం లేదు.

## ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి..




ఖమ్మం, ఆగష్టు 28: ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును కూడా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. ఈ సందర్భంగా విభాగాల అధికారులతో పాటు పోలీస్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ మురళి పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ పోరాటంతో సింగరేణిలో 23 కీలక ఒప్పందాలు

### సమ్మె నోటీసుతో దిగివచ్చిన సింగరేణి యాజమాన్యం



నిజామాబాద్, ఆగష్టు 28: సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాటం ఫలించింది. సమ్మె నోటీసు నేపథ్యంలో హైదరాబాద్ లో ఆర్ ఎల్ సీ సమక్షంలో జరిగిన చర్చల్లో యాజమాన్యం 23 కీలక డిమాండ్లకు అంగీకరించిందని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ ఆలీ తెలిపారు. రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో పిట్ సెక్రటరీ హరి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ద్వారక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బుధవారం (27వ తేదీ) హైదరాబాద్‌లో ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, 11 మెన్ కమిటీ సభ్యులు, సింగరేణి అధికారుల మధ్య జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలను వివరించారు.

కోల్ ఇండియా తరహాలో కార్మికుల పెర్క్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహణ, హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మందమర్రి-క్యాతన్‌పల్లి కార్మికులకు 9% హెచ్ ఆర్ ఏ వంటివి కీలకంగా ఉన్నాయి. అలాగే 3 ఏళ్ల ట్రాన్స్‌ఫర్ నిబంధన ఎత్తివేసి ఏడాదికి కుదించడం, ఖాళీ పోస్టుల భర్తీ, 22 ఏళ్లుగా మారని మెడికల్ అటెండెన్స్ రూల్స్ సవరణ, 149 మంది పెండింగ్ డిపెండెంట్లకు నెలలో ఆఫీస్ ఆర్డర్లు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఎస్ ఐ, చట్టబద్ధ సమ్మెలో పాల్గొనే కాంట్రాక్ట్ కార్మికులకు ఫైన్ లేకుండా నో వర్క్ నో పే మాత్రమే అమలు, సొంత ఇంటి పథకం అమలుకు ప్రభుత్వంతో చర్చ వంటి అంశాలపై యాజమాన్యం అంగీకరించింది. ఇది ఏఐటీయూసీ పోరాటానికి లభించిన చారిత్రాత్మక విజయమని నాయకులు అన్నారు. ఈ సమావేశంలో డొక్కు శ్రీనివాస్, కోటి అనిల్, సీతారామారావు, ఆవుల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు. 1

## భారత్ లో శ్రీలంక నౌకాదళం కమాండర్ వైస్ అడ్మిరల్ డామియన్ ఫెర్నాండో అధికార పర్యటన

శ్రీలంక నౌకాదళ అధిపతి వైస్ అడ్మిరల్ డామియన్ ఫెర్నాండో 2026 ఆగస్టు 26 నుంచి 29 వరకు భారతదేశంలో అధికారికంగా పర్యటిస్తున్నారు. సముద్ర రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసి భారత్ – శ్రీలంక నౌకాదళాల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది.

వైస్ అడ్మిరల్ డామియన్ ఫెర్నాండోకు ఈ రోజు న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్ వద్ద సైనిక గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరులకు నివాళులర్పించారు. ఉమ్మడి ఆపరేషన్లు, సామర్థ్య పెంపు, శిక్షణ, సముద్ర భద్రతకు సంబంధించిన చర్యలతో సహా సముద్ర రంగ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడంపై భారత నౌకాదళాధిపతి (సీఎన్ఎస్) అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌తో ఆయన చర్చలు జరిపారు.

ఈ పర్యటనలో భాగంగా, వైస్ అడ్మిరల్ ఫెర్నాండో రక్షణ శాఖ సీనియర్ అధికారులతో సమావేశం కానున్నారు. పరస్పర సహకారం, ఉమ్మడి భాగస్వామ్య అవకాశాలను పరిశీలించడానికి భారత రక్షణ రంగానికి చెందిన ప్రతినిధులతో చర్చలు జరపనున్నారు. పర్యటనలో భాగంగా, వైస్ అడ్మిరల్ ఫెర్నాండో కొచ్చి సందర్శిస్తారు. రెండు దేశాల నౌకాదళాల మధ్య శిక్షణ సంబంధాలను, వృత్తిపరమైన మార్పిడులను ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టితో భారత నౌకాదళ శిక్షణా సంస్థలను, దక్షిణ నౌకాదళ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శిస్తారు.

శ్రీలంక నౌకాదళం భారత నౌకాదళానికి సముద్ర రంగంలో సుదీర్ఘకాలంగా అత్యంత కీలకమైన సముద్ర భాగస్వామిగా ఉంది. వైస్ అడ్మిరల్ డామియన్ ఫెర్నాండో పర్యటన భారత్ – శ్రీలంక నౌకాదళాల మధ్య గల బహుముఖ సంబంధాలను మరింత పటిష్టం చేయడంతో పాటు సముద్ర రంగ సహకారాన్ని మరింత పెంపొందించడానికి, హిందూ మహాసముద్ర ప్రాంతంలో మరింత స్థిరత్వానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పౌర్ణమి నిదర్శనం

### ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మర్రి జనార్దన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగష్టు 28:భారతీయ సంస్కృతిలో కుటుంబ అనుబంధాలకు ప్రథమ ప్రాధాన్యం ఉందని నాగర్‌కర్నూల్ మాజీ శాసనసభ్యుడు మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు.

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధానికి రాఖీ పౌర్ణమి నిదర్శనమని పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా తన సోదరి శ్రీమతి ఇందిర మర్రి జనార్దన్‌రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంతో పాటు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# పస్రా-మేడారం రోడ్డుపై ప్రత్యేక తనిఖీలు

**మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు**

**అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక నిఘా**

**పండుగ చేసుకోండి.. ప్రాణాలతో చెలగాటం ఆడొద్దంటూ హెచ్చరిక**



హైదరాబాద్, ఆగష్టు 28: పండుగ వేళ ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ పస్రా?మేడారం ప్రధాన రహదారిపై పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్ సూచనలతో పస్రా సీఐ పీ. దయాకర్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించారు. పస్రా ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్, మేడారం ఎస్సై ఎ. కమలాకర్, తాడ్వాయి ఎస్సై కె. జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

**మద్యం సేవించి వాహనం నడపొద్దు**

మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారుడితో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ వినియోగించాలని పోలీసులు సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రం, బీమా పత్రాలు తదితర వాహన సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.

మద్యం వద్దు.. మాదకద్రవ్యాలు వద్దు.. అతివేగం వద్దు.. ప్రాణాలపై నిర్లక్ష్యం వద్దు అంటూ పోలీసులు యువతకు అవగాహన కల్పించారు. పండుగ ఆనందం మరో కుటుంబానికి విషాదంగా మారకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు.

"మీ రక్షణే మా బాధ్యత.. మీ సహకారమే మా బలం" అంటూ ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో పస్రా ఎస్సై తాజుద్దీన్, మేడారం ఎస్సై కమలాకర్, తాడ్వాయి ఎస్సై జగదీష్ గౌడ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగిఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు..10 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలు

అమరావతి, ఆగష్టు 28: తిరుపతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం లో 10 మంది ఆర్టీసీ ప్రయాణి కులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లా చెంబడిపాళెం వద్ద తెల్లవారుజామున లారీ టైర్ దెబ్బతిని లారీ జాతీయ రవ్హ నిలిపి ఉంచగా కర్ణాటక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది.

దీంతో బస్సులోని 10 మంది తీవ్రంగా గాయపడగా మరో 20 మందికి స్వల్పగాయలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను నాయుడుపేట ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి స్విమ్స్ నూతన డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్



తిరుపతి, ఆగష్టు 28: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్స్టిస్ట్యూట్ మెడికల్ సైన్స్ నూతన డైరెక్టర్ గా డాక్టర్ జగదీష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్. నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ అనుభవజ్ఞు లైన, గొప్ప పేరు, దూరదృష్టి గల వైద్యులైన డాక్టర్ జగనేతృత్వంలో స్విమ్స్ ఆసుపత్రిలో అత్యున్నతమైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్విమ్స్ ఆసుపత్రిని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. నూతన డైరెక్టర్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ తిరుపతిని ఇంటిగ్రేటెడ్ మెడికల్ హబ్ గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తామని వెల్లడించారు. స్విమ్స్ ఆసుపత్రిలో వైద్యంపై రోగుల్లో నమ్మకం కలగించి ఎప్పటికప్పుడు అత్యాధునిక వైద్యం అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవలను మరింత విస్తరించి పేదరోగులకు ఆర్థిక భారం తగ్గిస్తామని పేర్కొన్నారు.

# హిమ ప్రాంత చిరుతల సంరక్షణలో సైన్స్ ఆధారిత పురోగతిని ప్రస్తావించిన భారత్

న్యూఢిల్లీ, ఆగష్టు 28:హిమ ప్రాంత చిరుతపులుల అధ్యయనం, సంరక్షణ అంశాలపై రష్యా, భారత్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిన్న, అంటే 2026 ఆగష్టు 26న రష్యా రాజధాని మాస్కోలో నిర్వహించారు. మాస్కోలోని ఎ.ఎన్. సెవర్ట్‌సోవ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇకాలజీ అండ్ ఇవల్యూషన్ ఆఫ్ ది రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటైంది. మంచు ప్రాంతాల్లో సంచరించే జాతి చిరుతపులుల సంరక్షణ, పరిశోధన విషయాల్లో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో 2025 డిసెంబరులో కుదుర్చుకున్న ఓ భాగస్వామ్య ఒప్పందం తాలూకు ప్రాథమిక ప్రణాళిక ప్రకారం ఈ సమావేశాన్ని నిర్వహించారు.

భాగస్వామ్య ఒప్పంద పత్రాలపై ఇంటర్ రీజియనల్ అసోసియేషన్ 'ఐఆర్‌బీఐఎస్', ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్ (ఐబీసీఏ) ప్రతినిధులు సంతకాలు చేశారు.

విజ్ఞానశాస్త్ర కార్యక్రమాల నిర్వహణ ద్వారా హిమ ప్రాంత చిరుతపులుల సంరక్షణ రంగంలో భారత్ సాధించిన పురోగతిని కేంద్ర ప్రభుత్వ పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎమ్ఈఎఫ్‌సీసీ) ప్రతినిధి వర్గం సమావేశంలో ప్రస్తావించింది. ఈ జాతి చిరుతపులుల సంతతిని అంచనా వేయడం, రేడియో టెలిమెట్రీ, జన్యు సంబంధ విశ్లేషణలలో ప్రగతిని భారత వన్యప్రాణి సంస్థ (డబ్ల్యూఐఐ) అధికారులు సమావేశంలో తెలియజేశారు. సంరక్షణ ప్రయత్నాల్లో వైజ్ఞానిక పరికరాల పాత్ర అంతకంతకూ పెరుగుతున్నట్లు వారు స్పష్టం చేశారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో.. హిమ ప్రాంత చిరుతల సంరక్షణ, పరిశోధన రంగ నిపుణులతో పాటు రష్యా ప్రాకృతిక వనరులు, పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఎ.ఎన్. సెవర్ట్‌సోవ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇకాలజీ అండ్ ఇవల్యూషన్ ఆఫ్ ది రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, మాస్కో జంతు ప్రదర్శనశాల, రోస్పోట్రెబనాడజోర్ల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ జాతి చిరుతలను సంరక్షించడానికీ, విజ్ఞానశాస్త్ర పరమైన అధ్యయనాలను చేపట్టడానికీ సహకార దృక్పథంతో ముందుకు పోవడం ప్రధానాంశంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంతో పాటు తత్సంబంధిత చర్చల్లోనూ భారతీయ ప్రతినిధి వర్గం పాలుపంచుకుంది.

ఈ రౌండ్ టేబుల్ సమావేశం హిమ ప్రాంత చిరుతల సంరక్షణ, పర్యవేక్షణ, పరిశోధనలకు సంబంధించిన జ్ఞానాన్నీ, అనుభవాలనీ పరస్పరం వెల్లడించుకోవడానికీ, సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి భారత్‌కు, అంతర్జాతీయ భాగస్వాములకు ఒక ప్రధాన వేదికను అందించింది.

# ఉరుకుంద ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**భక్తులకు ఇబ్బందులు లేకుండా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**



అమరావతి, ఆగష్టు 28:ఉరుకుంద ఆలయంలో జరగనున్న శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఉరుకుంద శ్రావణ మాస ఉత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ, పోలీస్, వైద్య, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల అధికారులతో కలెక్టర్ దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

భక్తులకు 24 గంటలూ తాగునీరు అందుబాటులో ఉండేలా నిరంతర సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో ఎటు పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసరాల్లో రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా వెలుగులు ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందేలా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఆలయ పరిసరాల్లో నిఘా కెమెరాలు, ప్రకటనల వ్యవస్థ, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య చర్యలు, అగ్నిమాపక సేవలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుతం పార్కింగ్ స్థలాలు ఎక్కువగా ప్రైవేటు భూముల్లోనే ఉన్నందున భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా శాశ్వత పార్కింగ్ కోసం ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదోని ఆర్డీఓను ఆదేశించారు.

కుప్పగల్లు-ఉరుకుంద సింగిల్ లేన్ రహదారిపై మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను నిరంతరం చేపట్టి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

కుప్పగలు-ఉరుకుంద, కోసిగి-ఉరుకుంద రహదారులను రెండు వరుసల రహదారులుగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ఉరుకుంద ఆలయానికి శాశ్వత నీటి సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఈ శైలేశ్వర్, ఆదోని ఆర్డీఓ అరుణదేవి, ఉరుకుంద ఆలయ ఈఓ వాణి, పోలీస్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అల్లం కుంట సర్వే ప్రారంభం

**రెవెన్యూ, నీటిపారుదల శాఖల సంయుక్తంగా సర్వే**



ఆదిలాబాద్, ఆగష్టు 28:ఎట్టకేలకు మండలంలోని రేండ్లగూడ శివారులోని అల్లం వారి కుంట సర్వే శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా కుంట ముంపు ప్రాంతాన్ని సర్వే చేశారు. రేండ్లగూడ శివారులోని సర్వే నంబర్లు 160, 161లో 24 ఎకరాల చెరువు శిఖం భూమి ఉందని గ్రామ రైతులు తెలిపారు.

కుంటకు హద్దులు నిర్ణయించి సర్వే చేయాలని కోరుతూ రైతులు సముద్రాల శంకర్, దాసరి తిరుపతి, అల్లం సురేష్, అల్లం దస్తగిరి, ఆకుల మధు, వార్డు సభ్యుడు వెయికండ్ల రవి ఆధ్వర్యంలో గతంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఈ నెల 16న మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు రైతు సముద్రాల శంకర్ పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 17న రాత్రి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేపట్టారు.

జన్నారం నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ వెంకటేశం, ఏఈఈ శ్రవణ్, మండల సర్వేయర్ దినేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గం వెంకటేశం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మామిడి శంకర్, ఏఎస్సై ఉమేష్ కుమార్, జీపీఓ కమలాకర్ తదితరులు సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ చెట్‌పల్లి భూపతి, రైతులు, గ్రామస్థులు, నాయకులు బెడద గోపాల్, ఎస్. పవన్ యాదవ్, ఆకుల సత్యవ్వ, అల్లం నరేందర్, ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల బైఠాయింపు**

అల్లంవారి కుంటకు హద్దులు నిర్ణయించి సర్వే చేయాలని కోరుతూ రేండ్లగూడకు చెందిన రైతులు సముద్రాల శంకర్, దాసరి తిరుపతి తదితరులు శుక్రవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం మధ్యాహ్నం రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు కుంట సర్వే నిర్వహించారు.

# భద్రాద్రి జిల్లాలోని ప్రతి ఎకరాకు సీతారామ జలాలు అందించాలి : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖమ్మం, ఆగష్టు 28:సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండలాలకూ సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, రైతు సంఘం ప్రతినిధులతో కలిసి శుక్రవారం జూలూరుపాడు మండల పరిధిలోని వినోభానగర్ సమీపంలో గల రాజీవ్ లింక్ కెనాల్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సాగునీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు పనుల పురోగతి, నీటి విడుదల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను తరలించడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే, సీతారామ కెనాల్ నిర్మాణానికి భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల రైతులు తమ విలువైన భూములను త్యాగం చేశారని, నేడు వారికే సాగునీరు అందకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం పూర్తి కావడానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతులకు తక్షణమే నీరందించాలని కోరారు.

జూలూరుపాడు మండలంలోని కప్పలకుంట, శనగ చెరువు, దండ్యాల చెరువుల్లోకి ముందుగా గోదావరి జలాలను నింపి, అక్కడి నుండి సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనివల్ల ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోకుండా ఉంటాయని వివరించారు. ఇప్పటికే ఈ అంశాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# రాఖీ పండుగ సందర్భంగా చీరలు పంచిన బీజేపీ మేయర్.. తోపులాటలో స్పృహ కోల్పోయిన మహిళలు




లక్నో, ఆగష్టు 28: రాఖీ సందర్భంగా ఒక బీజేపీ మేయర్ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఊహించని విధంగా వేల సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. చీరల కోసం వారు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో కొందరు మహిళలు స్పృహ కోల్పోగా చాలామంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్ రక్షాబంధన్‌కు ఒక రోజు ముందు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం బరేలీ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమం కోసం 20,000 మందికిపైగా మహిళలు తరలివచ్చారు. పిల్లలు, కుటుంబంలోని వృద్ధులతో కలిసి ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు.

కాగా, బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్‌కు రాఖీలు కట్టేందుకు మహిళలకు ముందుగానే కూపన్లు పంపిణీ చేశారు. అయితే వారు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రౌండ్‌లో కనీసం నిల్చోవడానికి కూడా చోటు లేనంత పరిస్థితి ఏర్పడింది. చాలా మంది మహిళలు బారికేడ్లను దాటుకుని వేదిక వైపు వెళ్లారు. తీవ్ర ఎండ, ఉక్కపోత మధ్య మహిళల సంఖ్య పెరుగడంతో పరిస్థితి అదుపుతప్పింది.

మరోవైపు పంపిణీ చేస్తున్న చీరల కోసం మహిళలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో చాలా మంది మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. పలువురు గాయపడ్డారు. స్పృహ కోల్పోయిన, గాయపడిన మహిళలను అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించారు. ఈ నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై పలువురు మహిళలు మండిపడ్డారు.

అయితే ఈ కార్యక్రమం గురించి తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని పోలీస్ అధికారి తెలిపారు. అలాగే తోపులాటలో మహిళలు స్పృహ కోల్పోవడం, గాయపడటం గురించి ఎలాంటి అధికారిక ఫిర్యాదు కూడా నమోదు కాలేదని చెప్పారు. కాగా, మహిళల తోపులాట, స్పృహ కోల్పోవడం, గాయపడిన సంఘటనలకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శిగా చాంద్ పాషా

ఖమ్మం, ఆగష్టు 28: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శిగా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కె. చాంద్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ?కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల్లో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన యువతకు నిరుద్యోగ భృతి అందించాలని, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ?తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషాతో పాటు జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో యువజన సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# వ్యావహారిక బాషకు పితామహుడు గిడుగు రామమూర్తి



తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న గిడుగు రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. గిడుగు వెంకట రామమూర్తి (1863–1940) తెలుగు ప్రజలు స్మరించదగ్గ ప్రథమ స్మరణీయుడు గిడుగు రామమూర్తి. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వాడు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనావైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకుడు.

గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వాళ్ళతో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టాడు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నాడు.

సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు.

తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నాడాయన. భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించాడు, నచ్చచెప్పాడు.

## వ్యావహారిక భాషోద్యమం

తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారథ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు మరియు వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపాడు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసాడు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంధికభాషే పాతుకు పోయింది; కొన్నిటిలో వీరేశలింగంగారు ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసిలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించాడు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజు&ఝుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజ&ఝుల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు.

1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది.

వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి.

వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి.

వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నాడు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర–ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు.

మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర–ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్–ఇ–హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది.

మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రో–ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వాడు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివాడు.

విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించాడు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చాడు.

గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందాడు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డాడు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీక: మంత్రి సీతక్క



ములుగు ఆగష్టు 28:(నేటినిజం ప్రతినిధి): గోవిందరావుపేట: బంజారా సోదర, సోదరీమణులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో సర్పంచ్ బూక్యా సుమలత గారి ఇంటివద్ద ఏర్పాటు చేసిన తీజ్ ఉత్సవాల్లో మంత్రి సీతక్క పాల్గొని బంజారా సోదర, సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా తీజ్ పండుగ శుభసందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించిన మంత్రి సీతక్క, బంజారా సమాజం అభివృద్ధి, సంక్షేమం కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

బంజారా సమాజానికి తీజ్ పండుగ ఎంతో ప్రత్యేకమైనదని మంత్రి సీతక్క అన్నారు. ప్రకృతి పట్ల ప్రేమ, కుటుంబ బంధాలు, మహిళల భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల పరిరక్షణ వంటి అనేక గొప్ప విలువలను తీజ్ పండుగ ప్రతిబింబిస్తుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

తీజ్ పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, పాటలు పాడుతూ, నృత్యాలతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం బంజారా సంస్కృతిలోని వైవిధ్యాన్ని చాటుతుందని మంత్రి సీతక్క అన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

బంజారా సమాజ సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి, అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రతి కుటుంబం సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, ములుగు జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారామ్ నాయక్ గారితో పాటుగా గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## స్కూటర్‌ను తప్పించబోయి బోల్తాపడ్డ బస్సు..

న్యూఢిల్లీ, ఆగష్టు 28: కేరళలో బస్సు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న ఒక బస్సు.. స్కూటర్‌ను తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ షాకింగ్ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటన ఆగష్టు 27, గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో ఎర్నాకుళం జిల్లాలోని, కక్కూర్ సమీపంలో కూతట్టుకుళాం–పిరవోమ్ రోడ్డుపై జరిగింది.

ఒక ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు 35 మంది ప్రయాణికులతో వివాహ వేడుకకు వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు వేగంగా వెళ్తున్నప్పుడు, ముందు వెళుతున్న ఒక స్కూటర్ అనుకోకుండా అడ్డువచ్చింది. దీంతో ఆ స్కూటర్‌ను తప్పించబోయిన బస్సు దగ్గర్లో ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లి, బోల్తాపడింది. బస్సు అలాగే వెళ్లుంటే ఆ స్కూటరిస్టును ఢీకొనేది. అతడిని తప్పించే క్రమంలో, వేగంగా ఉండటం వల్ల బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు బోల్తా పడిన ఘటనలో 20 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు ప్రారంభించారు.



## చిగురుమామిడి మండలంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

మెదక్, ఆగష్టు 28:రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, పరస్పరం ప్రేమాభిమానాలను పంచుకొని స్వీట్లు తినిపించారు. వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు రాఖీలు కట్టేందుకు తరలిరావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ పేర్కొన్నారు. కుటుంబ విలువలు, పరస్పర గౌరవం, ఆప్యాయతలను పెంపొందించడంలో ఇటువంటి వేడుకలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా హుస్నాబాద్‌కు చెందిన 18 వ వార్డు కౌన్సిలర్ వాల సుప్రజ–నవీన్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## భారత ఆర్థిక సమ్మిళిత స్వరూపాన్ని మార్చడంలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి జన్ ధన్ యోజన

న్యూఢిల్లీ, ఆగష్టు 28:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ప్రారంభించిన కార్యక్రమాల్లో ఒకటిగా... 28 ఆగస్టు 2014న ప్రారంభమైన ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ 12 సంవత్సరాల పీఎంజేడీవై కార్యక్రమం భారత ఆర్థిక రంగంలో అద్భుత పరివర్తనకు సాక్ష్యంగా నిలిచింది. ఈ పథకం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సమ్మిళితానికి ఒక మార్గదర్శిగా మారింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంగా ఈ పీఎంజేడీవై... భారతీయులంతా బ్యాంకింగ్ సేవలను పొందే అవకాశాన్ని కల్పించడం కొనసాగిస్తోంది.

పటిష్ఠమైన ఆర్థిక సమ్మిళిత పథకాలు, విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా అట్టడుగున ఉన్న, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు మద్దతునివ్వడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. పీఎంజేడీవై పథకం ద్వారా, బ్యాంకు సేవలు అందని వయోజనులందరికీ ఎలాంటి కనీస బ్యాలెన్స్ అవసరం లేని, ఎలాంటి నిర్వహణ రుసుములు లేని ఒక సాధారణ బ్యాంకు ఖాతా అందుబాటులోకి వస్తుంది.

ప్రతి ఖాతాతో పాటు ఉచిత రూపే డెబిట్ కార్డు లభిస్తుంది. ఇది రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీని అందిస్తుంది. డిజిటల్ లావాదేవీలను, ఆర్థిక భద్రతను ప్రోత్సహిస్తుంది. ఖాతాదారులు రూ.10,000 వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యానికీ అర్హులు. ఇది అత్యవసర పరిస్థితుల్లో వారికి ఒక భరోసాను అందిస్తుంది.

పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి జన సురక్షా పథకాల ద్వారా... అసంఘటిత రంగంలోని లక్షలాది మంది కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమాను అందించడంలోనూ పీఎంజేడీవై ఖాతాలు కీలక పాత్ర పోషించాయి.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శ్రీ పంకజ్ చౌదరి మాట్లాడుతూ... "2014 ఆగస్టు 28న 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' (పీఎంజేడీవై) పేరుతో ఆర్థిక సమ్మిళిత జాతీయ మిషన్‌ను గౌరవ ప్రధానమంత్రి ప్రారంభించారు. నేడు 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' తన 12వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం నాకు సంతోషాన్నిస్తోంది. 59 కోట్లకు పైగా ఖాతాల ప్రారంభం, రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్ నిల్వలు లేదా 41.29 కోట్ల ఉచిత రూపే కార్డుల జారీ వంటి అంశాల కోణంలోనే పీఎంజేడీవైని చూడకూడదు. దీనిని దేశ బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో సాధించిన అద్భుతమైన మార్పుల కోణంలోనూ చూడాలి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, ఎటువంటి జాప్యం లేకుండా, సమాజంలోని ప్రతి వ్యక్తికీ... అత్యంత పేదవారికీ... ఆర్థిక సేవలను అందించడం దీనివల్లే సాధ్యమైంది" అన్నారు.పీఎంజేడీవై పథకం కింద తెరిచిన 78 శాతం ఖాతాలు గ్రామీణ, సెమీ–అర్బన్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. సుమారు 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉన్నాయి. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే అట్టడుగు వర్గాల ప్రజలను అధికారిక ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలన్న ఈ పథకం ప్రాధాన్యతను ఇది స్పష్టం చేస్తోంది.పీఎంజేడీవై పథకం లక్షలాది మందికి, ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారికి... వారి సామాజిక–ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడం కోసం బ్యాంకింగ్, ఆర్థిక సేవలను పొందేందుకు సాధికారత కల్పించింది. ఈ ఖాతా కలిగి ఉండడం సామాన్యులకు బీమా, పింఛను వంటి ప్రయోజనాలను పొందేందుకు వీలు కల్పించింది. ప్రతి రాష్ట్రం, జిల్లాలో అవిశ్రాంతంగా చేపట్టిన విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా... దేశంలోని దాదాపు ప్రతి వ్యక్తికీ బ్యాంకు ఖాతాలను అందించే దిశగా మేం పురోగమించాం.

## ములుగు జిల్లా కేంద్రంలో ఘనంగా VHPS 28వ ఆవిర్భావ దినోత్సవం



ములుగు ఆగష్టు 28:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న గారి ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ములుగు వెంకటాపూర్ మండలాల ఇంచార్జ్ కాడపాక శ్యామ్ మాదిగ కో ఇన్చార్జ్ మరాటి రవీందర్ మాదిగ గార్ల ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో VHPS వికలాంగ హక్కుల పోరాట సమితి జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ములుగు జిల్లా ఇంచార్జ్ చాతాల్ల రమేష్ మాదిగ

హాజరై విహెచ్పిఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే వృద్ధులు వితంతువులు వికలాంగులకు పెన్షన్ పెంచుతామని మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు 4000 పెన్షన్ 6000 చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలు అవుతున్న ఇప్పటికి ఇంకా పింఛన్ పెంచకపోవడం బాధాకరమని ఇచ్చిన హామీనీ నిలబెట్టుకోవాలని రమేష్ మాదిగ అన్నారు

. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ జిల్లా నాయకులు కొడారి సాంబయ్య మాదిగ ములుగు టౌన్ వికలాంగ హక్కుల పోరాట సమితి నాయకులు కుమార్ ఎనగందుల నరేష్ మాదిగ రత్న దామోదర్ మాదిగ మరాటి రవీందర్ మాదిగ సాంబయ్య సారయ్య రాజేష్, తదితరులు పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.